

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నాయకత్వంలో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ఎస్ఐపీబీ నందు మరో రూ.9,076 కోట్లతో 11 పారిశ్రామిక ప్రాజెక్టులకు ఆమోదం లభించగా, వాటి ద్వారా 10,531 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


బుధవారం 08.07.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 77 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# ఏపీకి టెక్ దిగ్గజాలే లక్ష్యం!



## హ్యుందాయ్, ఎల్‌జీ, శాంసంగ్, అపాక్ట్‌తో లోకేష్ వరుస భేటీలు

## సెమీకండక్టర్లు, ఈవీ, డిస్‌ప్లే ఫ్యాబ్, ఆర్అండ్‌డీ కేంద్రాల ఏర్పాటుకు ఆహ్వానం

## విశాఖ, తిరుపతి, అనంతపురంలో భారీ పెట్టుబడులపై ప్రతిపాదనలు

**సియోల్ (సౌత్ కొరియా):** దక్షిణ కొరియాకు చెందిన ఆటోమోటివ్ మాడ్యూల్స్, కాంపొనెంట్స్, ఎలక్ట్రిఫికేషన్ పరికరాల తయారీ సంస్థ హ్యుందాయ్ మోబిస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యంగ్ బిన్ కిమ్, వైస్ ప్రెసిడెంట్ హన్స్యోక్ పార్క్, జంగ్‌హో సియోలతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్ లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఏఐ, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్ లో ఈవీ సెమీ కండక్టర్స్ హబ్ ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. తిరుపతి/అనంతపురం సమీపంలో ఈవీ కాంపోనెంట్స్ & బ్యాటరీ సిస్టమ్స్ తయారీ కేంద్రం, విశాఖపట్నంలో హ్యుందాయ్ మోబిస్ ఆర్‌డీ/ఇంజనీరింగ్ విభాగాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. ఐఐటీ తిరుపతి భాగస్వామ్యంతో ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను ప్రతిపాదించారు. ఆటానమస్ డ్రైవింగ్/ADAS/ స్మార్ట్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిష్కారాలు, పరిశోధనలపై ఆర్‌టీఐహెచ్‌కు మార్గదర్శకత్వం వహించాల్సిందిగా సూచించారు. అనంతపురాన్ని ఆటోమొబైల్ హబ్‌గా మిగతా 2లో...

### సెమీకండక్టర్ పెట్టుబడులకు ఏపీ పిలుపు!

- అపాక్ట్‌తో భాగస్వామ్య విస్తరణపై లోకేష్ చర్చలు
- ఓఎస్‌ఏటీ నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ
- విశాఖ ప్రాజెక్టుపై సానుకూల సంకేతాలు

2 లో

### ఎల్‌జీ విస్తరణపై ఏపీ దృష్టి!

విశాఖలో జీసీసీ.. శ్రీసిటీలో ఎలక్ట్రానిక్స్ తయారీ విస్తరణకు ఆహ్వానం

ఐఓటీ, రోబోటిక్స్ ఇన్నోవేషన్ ల్యాబ్‌లపై చర్చలు

ప్రతిపాదనలను పరిశీలిస్తామన్న ఎల్‌జీ

2 లో



## పెట్టుబడులకు పచ్చజెండా

### 19వ ఎస్ఐపీబీలో రూ.9,076 కోట్లతో 11 ప్రాజెక్టులకు ఆమోదం

### 10,531 ఉద్యోగాలకు అవకాశం

### ఇథనాల్, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు ప్రోత్సాహం

### రైతు కుటుంబాలు ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదగాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రైతు కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూర్చేలా, ఎంట్రప్రెన్యూర్లుగా ఎదిగేందుకు దోహదం చేసేలా పారిశ్రామికీకరణ జరగాలని... ఆ దిశగా పెట్టుబడులను ఆకర్షించాలాని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఇందులో భాగంగా భవిష్యత్‌లో పెరిగే ఇథనాల్ డిమాండ్‌ను అందిపుచ్చుకోవాలని చెప్పారు. ఇథనాల్ బ్లెండింగ్ 40 శాతానికి పెంచితే... మొక్కజొన్న రైతులకు మిగతా 2లో...

## నేటి నుంచే సదరం స్లాట్ బుకింగ్

- జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి నమోదు ప్రారంభం
- దివ్యాంగుల డేటాకు బ్లాక్‌చెయిన్ భద్రత
- సేవలన్నీ ఉచితం.. దళారులను నమ్మొద్దు : మంత్రి వై. సత్యకుమార్ యాదవ్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** సదరం రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్) స్లాట్ బుకింగ్ ప్రక్రియ జూలై 8 నుంచి ప్రారంభమవుతుందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. దివ్యాంగుల డేటా భద్రత కోసం బ్లాక్‌చెయిన్ టెక్నాలజీని వినియోగిస్తున్నామని, దీంతో రికార్డుల్లో అనధికార మార్పులు లేదా ట్యాంపరింగ్‌కు అవకాశం ఉండదని వెల్లడించారు. ప్రభుత్వం పూర్తిగా పారదర్శక విధానంలో ఉచితంగా వైకల్య నిర్ధారణ పరీక్షలు మిగతా 2లో...

## పంట బీమా యథాతథం..!



- 2026-27కూ పథకాల కొనసాగింపు
- అర్హులంతా నమోదు చేసుకోవాలని పిలుపు
- రుణ రైతులకు ఆప్ట్-అవుట్ యథాతథం
- ప్రీమియం సబ్సిడీ భారం రాష్ట్ర ప్రభుత్వమే

2 లో

## హస్తకళల పరిరక్షణ... కూటమి ప్రభుత్వం బాధ్యత

- టెంపుల్ టూరిజం తరహాలో హస్తకళల పర్యాటకం
- ప్రతి కళాకృతిపై క్యూఆర్ కోడ్‌తో కళాకారుడికే గుర్తింపు
- కామన్ ఫెసిలిటీ సెంటర్లు, వైద్య శిబిరాలు
- గోదావరి పుష్కరాల్లో తోలుబొమ్మలాటకు ప్రత్యేక ప్రాధాన్యం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం తరహాలో హస్తకళల పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. కళాఖండాన్ని రూపొందించిన కళాకారుడికి ఆ గుర్తింపు దక్కే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కళాకారుల కష్టాన్ని ప్రపంచానికి పరిచయం చేసే విధంగా ప్రత్యేక డాక్యుమెంటరీలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. విబి జీ రాం జీ పథకం కింద క్లస్టర్లవారీగా కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. హస్తకళల పరిరక్షణకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. హస్తకళాకారుల ఆరోగ్య పరిరక్షణకు క్లస్టర్ల వారీగా నిరంతరం వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ (లేపాక్షి) ఏర్పాటు చేసిన లిలి'ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం-2026'లిలిను పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. మంగళవారం విజయవాడలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళా వేదికలో ఏర్పాటు చేసిన ఈ మహోత్సవంలో రాష్ట్ర నలుమూలల నుంచి వివిధ ప్రాంతాలకు మిగతా 2లో...

## ఏపీకి రూ.2,545 కోట్ల ఊతం

### వీబీ-జీ రామ్-జీ తొలి విడత నిధుల విడుదల

**గ్రామీణ ఉపాధి, శాశ్వత మౌలిక సదుపాయాల అభివృద్ధికి భారీ చేయూత**

**కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్**



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) (వీబీ-జీ రామ్-జీ) పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు తొలి విడతగా రూ. 2,545.50 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఈ నిధులు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల విస్తరణతో పాటు శాశ్వత మౌలిక సదుపాయాల కల్పన, స్థిరమైన జీవనోపాధి అవకాశాల సృష్టికి దోహదపడతాయని పేర్కొన్నారు.

ఒక ప్రకటనలో మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం, విడుదలైన నిధుల్లో రూ. 1,414.16 కోట్లు కూలీల వేతనాల చెల్లింపులకు, రూ. 942.77 మిగతా 3లో...

## ప్రతి పేదకూ పక్కా ఇల్లు




- అర్హులందరికీ గృహాలే ప్రభుత్వ లక్ష్యం
- 9.50 లక్షల మంది అర్హుల గుర్తింపు
- తొలి విడతలో 74,812 ఇళ్ల మంజూరు
- నిర్మాణాలకు వేగం పెంచిన కూటమి ప్రభుత్వం: మంత్రి కొలుసు పార్థసారథి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి పక్కా గృహం అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. మిగతా 3లో...

## విజయవాడకు మరో రెండు విమానాలు

- ఆగస్టు 13 నుంచి వారణాసి, కోల్‌కతాకు ఇండిగో సర్వీసులు
- వారానికి మూడు రోజులు రాకపోకలు
- పర్యాటక, వ్యాపార రంగాలకు మరింత ఊతం



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ ప్రయాణికులకు ఇండిగో ఎయిర్‌లైన్స్ సరికొత్త శుభవార్త అందించింది. ఆగస్టు 13, 2026 నుండి విజయవాడను ఆధ్యాత్మిక నగరమైన వారణాసి, మరియు చారిత్రక నగరమైన కోల్‌కతాతో అనుసంధానిస్తూ విజయవాడ నుండి కొత్త విమాన సర్వీసులను ప్రారంభించనున్నట్లు ఇండిగో సేల్స్ ప్రతినిధులు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన అధికారిక పోస్టర్‌ను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయవాడ నుండి వారణాసి, కోల్‌కతా నగరాలకు నేరుగా విమాన సర్వీసులు ప్రారంభం కావడం పట్ల మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. మిగతా 2లో...



## 2027 గడువులోపే పోలవరం పూర్తి !

- షెడ్యూల్ ప్రకారమే పనులు
- మంత్రి నిమ్మల రామానాయుడు

**ఏలూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రుల జీవనాడిగా భావించే పోలవరం ప్రాజెక్టును 2027 గోదావరి పుష్కరాలకు ముందే పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం షెడ్యూల్ ప్రకారమే మిగతా 3లో...

## కల్లుగీత కార్మికులకు భరోసా

- నీరా ఉత్పత్తుల విలువ పెంచి ఉపాధి విస్తరణ
- సుస్థిర ఆదాయానికి ప్రత్యేక చర్యలు : మంత్రి రవీంద్ర



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** నీరా (కల్లు) అనేది ఆరోగ్యకరమైన పానీయమే అని రాష్ట్ర గనులు, భూగర్భ మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి వర్యులు కొల్లు రవీంద్ర అన్నారు. రంపచోడవరం మండలం పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం లినీరా ప్రాజెక్ట్ ప్రచారం మరియు ఏర్పాటు కొరకు నీరా(కల్లుగీత) కార్మికుల సంఘంతో పరస్పర సమన్వయ ప్రోత్సాహ సంస్థాగత సదస్సులి ను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రివర్యులకు రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆధ్వర్యంలో ఏజెన్సీ ముఖ ద్వారం గడి బాపనమ్మ తల్లి దేవస్థానం వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ మర్యాదల చొప్పున సీతపల్లి దేవస్థానంలో ప్రత్యేక పూజలు మిగతా 3లో...

## నేటి నుంచే సదరం స్లాట్ బుకింగ్



(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించి ధృవీకరణ పత్రాలు జారీ చేస్తోందని, దళారులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని సూచించారు.
దివ్యాంగులకు ప్రయాణ భారం, ఖర్చులు తగ్గించేందుకు రాష్ట్రాన్ని ఆరు జోన్లుగా విభజించి కొత్త జోనల్ స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇకపై దరఖాస్తుదారులు తమ జిల్లా లేదా అదే జోన్‌లోని సమీప జిల్లాలోనే వైకల్య నిర్ధారణ పరీక్షలు చేయించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. కొత్త విధానంలో అసెస్‌మెంట్ పరీక్షలు జూలై 13 నుంచి ప్రారంభమవుతాయని, సెప్టెంబర్ చివరి వరకు సుమారు 70 వేల మంది దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు.
కొత్త దరఖాస్తుదారులు ఆధార్, మొబైల్ నంబర్, ఈ-మెయిల్ ఐడీతో ఏపీ సేవ పోర్టల్‌లో నేరుగా స్లాట్ బుక్ చేసుకోవచ్చని, గ్రామ, వార్డు సచివాలయాల్లో కూడా ఈ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. త్వరలో 'మన మిత్ర' వాట్సాప్ సేవ ద్వారా కూడా స్లాట్ బుకింగ్ సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. స్లాట్ బుకింగ్, వైకల్య నిర్ధారణ పరీక్ష, ధృవీకరణ పత్రం డౌన్‌లోడ్ పూర్తిగా ఉచితమని, ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. మొదటి పరీక్ష ఫలితంపై అసంతృప్తి ఉంటే మరో రెండు సార్లు మాత్రమే అప్పీల్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు.
సదరం వ్యవస్థలో పారదర్శకత పెంచేందుకు వైద్యుల ఓటీపీ ఆధారిత లాగిన్, ఫోటో క్యాప్చర్, తప్పనిసరి హాజరు నమోదు, డిజిటల్ రికార్డింగ్ వంటి భద్రతా ఫీచర్లను ప్రవేశపెట్టినట్లు చక్రధర్ బాబు తెలిపారు. సాంకేతిక సమస్యలు, ఇతర సందేహాల నివృత్తికి త్వరలో 104 హెల్ప్‌డెస్క్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఎవరైనా సదరం సర్టిఫికెట్లు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు డిమాండ్ చేస్తే నమ్మవద్దని, అలాంటి వారిపై వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. మరింత సహాయం కోసం గ్రామ, వార్డు సచివాలయాలు, 'మన మిత్ర' వాట్సాప్ సేవ లేదా అధికారిక సదరం, ఏపీ సేవ పోర్టళ్లను సంప్రదించాలని సూచించారు.

## ఏపీకి టెక్ దిగ్గజాలే లక్ష్యం!

(మొదటి పేజీ తరువాయి)

మార్చడానికి, టైర్-1 సరఫరాదారుల సమావేశాన్ని నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్‌తో భాగస్వామ్యం వహించాలని కోరారు. భారతదేశంలో హ్యుందాయ్ మోబిస్ విస్తరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంపూర్ణ మద్దతునిస్తుందని చెప్పారు.
హ్యుందాయ్ మోబిస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యంగ్ బిన్ కిమ్ మాట్లాడుతూ... భారత్ లోని చెన్నై, అనంతపురంలో మాడ్యూల్స్, కీలక విడిభాగాలను తమ సంస్థ తయారు చేస్తుందని తెలిపారు. గురుగ్రామ్ ఆఫ్టర్‌మార్కెట్ విడిభాగాల కేంద్రంగా ఉంది, చెన్నై లాజిస్టిక్స్ కేంద్రం నుంచి హ్యుందాయ్/కియా సర్వీస్ విడిభాగాలను ఎగుమతి చేస్తుందని చెప్పారు. కొత్తగా హైదరాబాద్ లో ఆర్ ఓ డీ కేంద్రం, బెంగళూరులో సాఫ్ట్ వేర్ ఆర్ ఓ డీ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతపురంలోని తయారీ కేంద్రం ద్వారా హ్యుందాయ్ సంస్థ కియా ఇండియా కోసం మాడ్యూల్స్, కీలక విడిభాగాలను ఉత్పత్తి చేస్తుందని, ఎయిర్‌బ్యాగ్‌లు, ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్‌ల వంటి కీలక భాగాలను సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

## విజయవాడకు మరో రెండు విమానాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సర్వీసులు ప్రయాణికులకు ఎంతో సమయాన్ని ఆదా చేయడమే కాకుండా, పర్యాటక, వ్యాపార రంగాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వారంలో నిర్ణీత రోజులలో (మంగళ, గురు, శనివారాల్లో) ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయని ఇండిగో ప్రతినిధులు పేర్కొన్నారు.
వివరాల్లోకి వెళ్తే 6జు 6502 నెంబర్ గల ఫ్లైట్ సాయంత్రం 6.20 కి విజయవాడ ఎయిర్‌పోర్ట్ నుండి ప్రారంభమై రాత్రి 8:15 గం. లకు వారణాసి చేరుతుందన్నారు.. అంతకుముందు 6జు 6501 నెంబర్ గల ఇండిగో ఫ్లైట్ వారణాసి నుండి సాయంత్రం 3.55 కు బయలుదేరి సాయంత్రం 5.50 కి విజయవాడ చేరుకుంటుందని మంత్రి దుర్గేష్ తెలిపారు..
**అదే విధంగా 6జు 6502 నెంబర్ గల :** ఫ్లైట్ విజయవాడ నుండి సాయంత్రం 6.20 కి ప్రారంభమై వయా వారణాసి మీదుగా రాత్రి 10.15 గం. లకు కలకత్తా చేరుతుందని తెలిపారు.. మరియు 6జు 6501 నెంబర్ గల ఫ్లైట్ మధ్యాహ్నం 2.10 గం. లకు కలకత్తా నుండి బయలుదేరి వారణాసి మీదుగా సాయంత్రం 5.50 గం. లకు విజయవాడ చేరుతుందన్నారు.

## తమిళనాడులో ప్రభుత్వ ఆసుపత్రుల ఔషధ పంపిణీ వ్యవస్థపై ఏపీ కమిటీ అధ్యయనం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ ఆసుపత్రులకు మందుల కొనుగోలు, నిల్వ, పంపిణీ వ్యవస్థను అధ్యయనం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక కమిటీ మంగళవారం చెన్నైలో పర్యటించింది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణువర్ధన్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ తమిళనాడులో అమలవుతున్న ఔషధ సరఫరా విధానాన్ని పరిశీలించింది.
పర్యటనలో భాగంగా కమిటీ సభ్యులు చెన్నైలోని రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రి డీన్ డాక్టర్ శాంతారామన్‌తో సమావేశమయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అందిస్తున్న మందులు, వాటి నిల్వలు, సరఫరా విధానంపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలోని ఔషధ గిడ్డంగిని పరిశీలించి నిల్వల నిర్వహణ, పంపిణీ ప్రక్రియపై అధ్యయనం చేశారు. తర్వాత తమిళనాడు మెడికల్ సర్వీసెస్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించిన కమిటీ సభ్యులు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణన్ ఉన్నితో సమావేశమయ్యారు. మందులు, వైద్య పరికరాల కొనుగోలు విధానం, నాణ్యత నియంత్రణ, సరఫరా వ్యవస్థ, ప్రభుత్వ ఆసుపత్రులకు పంపిణీ ప్రక్రియపై అధికారులు కమిటీకి వివరించారు. సరఫరాదారులకు మూడు నుంచి ఆరు వారాల వ్యవధిలో చెల్లింపులు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సంస్థలోని వివిధ విభాగాల అధికారులతో కమిటీ సభ్యులు విడివిడిగా సమావేశమై విధివిధానాలను పరిశీలించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కమిటీలో విశాఖపట్నం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, వైద్య, ఆరోగ్య శాఖ సీనియర్ అధికారులు గణపతిరావు, అప్పారావు, ఏపీఎస్ఎంఐడీసీ డ్రగ్స్ విభాగం జనరల్ మేనేజర్ (ఎఫ్ఏసీ) శ్రీనివాసరావు, సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ అశ్విని, ఈ-ఔషధి విభాగానికి చెందిన డాక్టర్ వరప్రసాద్, సీనియర్ ఫార్మసీ అధికారులు శ్రీను, పద్మ మీనాక్షి సభ్యులుగా ఉన్నారు. కమిటీ సభ్యుల్లో కొందరు బుధవారం తమిళనాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఇతర ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శించి అక్కడ అమలవుతున్న ఔషధ పంపిణీ, నిర్వహణ వ్యవస్థపై మరింత అధ్యయనం చేయనున్నారు.

# పెట్టుబడులకు పచ్చజెండా



(మొదటి పేజీ తరువాయి)

అదనపు ఆదాయం వస్తుందన్నారు. ఇథనాల్ తయారీ రంగంలో వచ్చే అన్ని పెట్టుబడులను ప్రోత్సహించాలన్నారు. పెట్రోలు, డీజిల్‌లో మిక్స్ చేసేందుకు ఇథనాల్ భారీగా అవసరం కానుందన్నారు. ఇథనాల్, మీథేన్, ఏవియేషన్ ఫ్యూయల్‌కు సంబంధించి పాలసీ తీసుకురావాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. సంపద సృష్టి, సర్క్యులర్ ఎకానమీ అనేది ప్రభుత్వ విధానం అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను పెద్దఎత్తున ప్రోత్సహించాలని నిర్దేశించారు. సచివాలయంలో మంగళవారం 19వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశాన్ని ముఖ్యమంత్రి నిర్వహించారు. ఈ సమావేశంలో మొత్తం 11 ప్రాజెక్టులకు సంబంధించి రూ. 9,076.11 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. దీంతో 10,531 ఉద్యోగాలు రాష్ట్రానికి రానున్నాయి.
**100 ఎక్స్‌పీరియన్స్ సెంటర్ల ఏర్పాటు లక్ష్యం:** 'పర్యాటకరంగంలో అపార అవకాశాలు ఉన్నాయి. తిమ్మమ్మ మర్రిమాను సహా రాష్ట్రవ్యాప్తంగా 100 టూరిస్ట్ స్పాట్‌ల దగ్గర ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. పోలవరం, దిండి, గండికోట, కంబం చెరువు, లంబసింగి లాంటి ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి. లంబసింగి, అరకు సమీపంలో రిసార్ట్ ఏర్పాటుకు జిందాల్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేస్తోంది. ఏటికొప్పాక, కొండపల్లి , ధర్మవరం, మంగళగిరి, ఉప్పాడ, పొందూరు కళారూపాల్ని కూడా తీర్చిదిద్దాలి. ఇందుకోసం వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలి. నేచర్, వాటర్, అమ్యూజ్మెంట్ పార్కులను అనుసంధానించాలి. సూర్యలంక మాస్టర్ ప్లాన్ త్వరితగతిన రూపొందించాలి. కుప్పంలో కంగుంది కోట, చిత్తూరు జిల్లాలో ఎలిఫెంట్ సఫారీ వంటివి అభివృద్ధి చేయాలి. ముఖ్యంగా పర్యాటక రంగం నుంచి జీఎస్‌డీపీకి వాటా పెరిగేలా చూడాలి.' అని ముఖ్యమంత్రి చెప్పారు. మరోవైపు రాష్ట్రంలో పర్యాటకరంగ అభివృద్ధికి అవసరమైన హోటల్ గదులు పెద్దఎత్తున వస్తున్నాయని సీఎం అన్నారు. 2024లో 4,390 హోటల్ రూములు ఉంటే... ఈ రెండేళ్లలో 9,364 హోటల్ రూముల నిర్మాణానికి అనుమతులు ఇచ్చామన్నారు. దీంతో రాష్ట్రంలో 13,753 హోటల్ రూములు అందుబాటులోకి వస్తుండగా... దీనికి కృషి చేసిన అధికారులకు సీఎం అభినందనలు తెలిపారు.
**సోలార్ సెల్స్ తయారీలో అగ్రగామి కావాలి :** రెన్యువబుల్ ఎనర్జీ విస్తృతం కావడంతో సోలార్ సెల్స్ తయారీ పరిశ్రమలను ఆహ్వానించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. సోలార్ సెల్స్‌లో ఏపీ అగ్రగామిగా నిలవాలన్నారు. ఇంకా ఏర్పాటు చేయాల్సిన 38 ఎంఎస్ఎంఈ పార్కులను త్వరితగతిన ప్రారంభించాలని నిర్దేశించారు. రైల్వే టెర్మినల్స్‌కు ఎంఎస్ఎంఈ పార్కులను ఇంటిగ్రేట్ చేయాలన్నారు. లాజిస్టిక్స్ యూనివర్సిటీ, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లతో యువతకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే పరిశ్రమలకు గ్రీన్ ఎనర్జీ వినియోగించేలా చూడాలన్నారు. బీపీసీఎల్, ఆమ్కా ప్రాజెక్టులు త్వరగా గ్రౌండింగ్ అయ్యేలా సంప్రదింపులు జరపాలన్నారు. రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశానికి మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, దుర్గేష్, సీఎస్ సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.
ప్రజాప్రభుత్వం అధికారం చేపట్టిన ఈ రెండేళ్లలో ఇప్పటివరకు 19 ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహించగా 339 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. వీటితో రాష్ట్రానికి మొత్తం రూ. 11,86,271 కోట్ల విలువైన పెట్టుబడులు వస్తున్నాయి. అలాగే 10,41,821 మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయి.

1. డీఎస్ఆర్ హాస్పిటాలిటీ సర్వీసెస్ సంస్థ నెల్లూరు జిల్లాలో 4 స్టార్ హోటల్ - రూ. 139.92 కోట్ల పెట్టుబడి, 180 మందికి ఉపాధి.
2. మాధవి లీజర్ అండ్ స్టేస్ ప్రైవేట్ లిమిటెడ్ వైఎస్సార్ కడప జిల్లాలో 3 స్టార్ హోటల్ - రూ. 52.10 కోట్ల పెట్టుబడి, 400 మందికి ఉపాధి.
3. శ్రీనివాసం అమ్యూజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ వైఎస్సార్ కడప జిల్లాలో సమగ్ర అమ్యూజ్‌మెంట్ పార్క్ - రూ. 68.69 కోట్ల పెట్టుబడి, 690 మందికి ఉపాధి.
4. వజ్ర హాస్పిటాలిటీ ఎల్ఎల్‌పీ విజయవాడలో హోటల్, బ్యాంక్వెట్, ఎగ్జిబిషన్ సెంటర్ - రూ. 62.40 కోట్ల పెట్టుబడి, 450 మందికి ఉపాధి.
5. నెక్సస్ ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్ (చీ×ూా) తిరుపతి జిల్లా సత్యవేడు మండలం చిన్నఎట్టిపాకంలో ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్ - రూ. 255 కోట్ల పెట్టుబడి, 400 మందికి పైగా ఉపాధి.
6. అక్షత్ గ్రీన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ అనకాపల్లి జిల్లా పరవాడలో సోలార్ సెల్, మాడ్యూల్ తయారీ యూనిట్ - రూ. 1,600 కోట్ల పెట్టుబడి, 750 మందికి ఉపాధి.
7. బెర్రీ అలాయ్స్ లిమిటెడ్ బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో ఇంటిగ్రేటెడ్ మాంగనీస్ సిన్టర్, డీఆర్ఐ, కార్బన్ పేస్ట్ ప్లాంట్ - రూ. 1,200 కోట్ల పెట్టుబడి, 831 మందికి ఉపాధి.
8. జియో మైసూర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలో స్వర్ణగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్ - రూ. 689 కోట్ల పెట్టుబడి, 1,750 మందికి ఉపాధి.
9. ఈకో బాక్స్ ఇండస్ట్రియల్స్ అసెట్ ×ఓ ప్రైవేట్ లిమిటెడ్ (గూగుల్ వేర్ హౌస్ పార్ట్‌నర్స్) విశాఖపట్నంలో లాజిస్టిక్స్, లైట్ ఇండస్ట్రియల్ పార్క్ - రూ. 1,008 కోట్ల పెట్టుబడి, 5,000 మందికి ఉపాధి.
10. అదానీ ఫౌండేషన్ విశాఖపట్నం జిల్లా కపులుప్పాడలో ప్రాజెక్టు - రూ. 2,200 కోట్ల పెట్టుబడి.
11. మోండెలీజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ తిరుపతి జిల్లా శ్రీ సిటీలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ - రూ. 1,801 కోట్ల పెట్టుబడి, 80 మందికి ఉపాధి.

## ఎల్‌జీ విస్తరణపై ఏపీ దృష్టి!



**సియోల్ (సౌత్ కొరియా):** ఎల్ జీ ఎలక్ట్రానిక్స్ (గ్లోబల్) సీఈవో ల్యూ జె చెయోల్, ఎల్ జీ ఎలక్ట్రానిక్స్ (ఇండియా) సీఈవో హాంగ్ జు జియోన్‌లతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్ లోని ఎల్ జీ ట్విన్ టవర్స్ లో విడివిడిగా భేటీ అయ్యారు.
ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఎల్ జీ ఎలక్ట్రానిక్స్ నోయిడా, బెంగళూరు ప్రాజెక్టులను విస్తరిస్తూ విశాఖపట్నంలో ఒక ఇంజనీరింగ్ సెంటర్/జీసీసీ ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. శ్రీసిటీ, దాని పరిసర ప్రాంతాల్లో డిస్‌ప్లే మాడ్యూల్స్, సెన్సార్లు, పవర్ ఎలక్ట్రానిక్స్ మొదలైన వాటి విడిభాగాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని కోరారు. ఐఓటీ, రోబోటిక్స్‌పై ఇన్నోవేషన్ ల్యాబ్‌లను అభివృద్ధి చేయడానికి ఆర్‌టీఐహెచ్‌తో కలిసి పనిచేయాలని కోరారు. క్యారియర్ సంస్థ తరహాలో వాణిజ్య ప్రయోజనాల కోసం చిల్లర్ మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ఏర్పాటుచేయాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.
ఎల్ జీ ఎలక్ట్రానిక్స్ (ఇండియా) సీఈవో హాంగ్ జు జియోన్ మాట్లాడుతూ... ఎల్ జీ ఎలక్ట్రానిక్స్ (ఇండియా) భారతదేశ రిఫ్రిజిరేటర్ మార్కెట్ లో సుమారు 28%, వాషింగ్ మెషీన్లలో 33.5% వాటాను కలిగి ఉంది, ఎయిర్ కండిషనర్లలో రెండవ స్థానంలో ఉందని తెలిపారు. 1997లో భారతదేశ మార్కెట్ లోకి ప్రవేశించిన ఎల్ జీ ఇండియా గ్రేటర్ నోయిడా (యూపీ), రంజన్ గావ్, పూణే (మహారాష్ట్ర)లలో ప్లాంట్లను నిర్వహిస్తోంది. కొత్తగా ఏపీలోని శ్రీసిటీలో రూ. 5,000 కోట్ల వ్యయంతో 3వ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మిస్తోంది. దీనిద్వారా సుమారు 1,500 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి.
ఈ ఏడాది చివరినాటికి శ్రీసిటీ యూనిట్ ద్వారా వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించాలని భావిస్తున్నాం. దీనిద్వారా ఏసీ కంప్రెసర్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, ఏసీలు ఉత్పత్తి చేస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని హాంగ్ జు జియోన్ తెలిపారు. ఈ సమావేశంలో ఎల్ జీ ఇండియా సీఎఫ్ఓ డాంగ్ మ్యుంగ్ సియో, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ కన్నా, శ్రీసిటీ ఫ్యాక్టరీ ప్రొడక్షన్ లీడర్ హెయో సుంగ్ పాల్గొన్నారు.

## సెమీకండక్టర్ పెట్టుబడులకు ఏపీ పిలుపు!



**సియోల్ (సౌత్ కొరియా):** సెమీకండక్టర్స్, OSAT (అసెంబ్లింగ్, ప్యాకేజింగ్, టెస్టింగ్) రంగంలో పేరెన్నికగన్న 'అపాక్ట్' (ూూాజు) కంపెనీ సీఈవో సియాంగ్ డాంగ్ లీ తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్ లో సమావేశమయ్యారు.
ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ASIP భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌లో అపాక్ట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి నిర్ణయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అపాక్ట్‌తో దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని ఆశిస్తున్నట్లు చెప్పారు. భారతదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు పరిశీలిస్తున్న 'హనా మైక్రాన్' తో పాటు ఇతర OSAT సంస్థలు ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా అనుసంధానించాలని ూూాజుని కోరారు. ూూ సెమీకండక్టర్ కార్యకలాపాలకు సంబంధించి యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడం కోసం ూూాణజతో భాగస్వామ్యం కుదుర్చుకోవాలని మంత్రి లోకేష్ ప్రతిపాదించారు. భారతదేశంలో అపాక్ట్ కార్యకలాపాల విస్తరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని స్పష్టం చేశారు.
అపాక్ట్ సీఈవో సియాంగ్ డాంగ్ లీ మాట్లాడుతూ... హైదరాబాద్ కోసం ఫిబ్రవరి 2024లో ప్రకటించిన ASIP టెక్నాలజీస్ జాయింట్ వెంచర్‌కు, విశాఖపట్నం కోసం 12 ఆగస్టు 2025న ఇండియా సెమీకండక్టర్ మిషన్ కింద ఆమోదం లభించిందని తెలిపారు. 468 కోట్లతో, సంవత్సరానికి 96 మిలియన్ల పరికరాలను తయారుచేసే లక్ష్యంతో ఏర్పాటు కానున్న విశాఖ యూనిట్ నిర్మాణం త్వరలోనే ప్రారంభమవుతుందని చెప్పారు. ASIP-APACT వైజాగ్ ూూ జాయింట్ వెంచర్ ఆంధ్రప్రదేశ్‌కు లభించిన ఒక ప్రతిష్టాత్మక సెమీకండక్టర్ విజయమని ఆయన అభివర్ణించారు. ఏపీ ప్రభుత్వం అందించిన ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని ఈ సందర్భంగా లీ తెలిపారు.

## బోటు ప్రమాదంలో గాయపడిన మత్స్యకారుడిని పరామర్శించిన బీజేపీ మాధవ్



**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** సముద్రంలో బోటు గల్లంతైన ఘటనలో ప్రాణాలతో బయటపడి చికిత్స పొందుతున్న మత్స్యకారుడు కారి చిన్నాను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మంగళవారం విశాఖపట్నంలోని షీలానగర్ కిమ్స్ ఆసుపత్రిలో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.
ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, సముద్రంలో జరిగిన విషాద ఘటనలో ప్రాణాలతో బయటపడిన కారి చిన్నా చెప్పిన వివరాలు తీవ్రంగా కలచివేశాయని అన్నారు. తనతో వేటకు వెళ్లిన తోటి మత్స్యకారులు, కుటుంబ సభ్యులు గల్లంతయ్యారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేయడం హృదయవిదారకంగా అనిపించిందన్నారు. గల్లంతైన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.
భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా మత్స్యకారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. వేటకు వెళ్లే బోట్లకు జియోట్యాగింగ్‌తో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించడం ద్వారా ప్రమాదాలను తగ్గించే అవకాశం ఉందని పేర్కొన్నారు. మత్స్యకారుల ప్రాణ భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.
పరామర్శ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరుశురామరాజు, గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పంట బీమా యథాతథం..!



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని రైతులకు పంటల భద్రత కల్పించేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలను 2026-27 సంవత్సరానికి (ఖరీఫ్-2026, రబీ 2026-27) మరో ఏడాది పాటు కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, సహకార శాఖల ద్వారా సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయని పేర్కొన్నారు. పంటల బీమా పథకాల ద్వారా ప్రకృతి వైపరీత్యాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ఇతర అనుకోని కారణాలతో పంట నష్టపోయిన రైతులకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఖరీఫ్-2026 సీజన్‌లో నోటిఫై చేసిన ప్రాంతాల్లో నోటిఫై చేసిన పంటలను సాగు చేస్తున్న యజమాని రైతులు, కౌలు రైతులు, భాగస్వామ్య సాగుదారులు, పంటపై బీమా హక్కు కలిగిన వారు అందరూ పథకంలో నమోదు చేసుకోవచ్చని మంత్రి పిలుపునిచ్చారు.

రైతులు గడువులోపు నమోదు చేసుకోవాలి

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఖరీఫ్-2026 సీజన్‌లో వరి మినహా అన్ని నోటిఫైడ్ పంటలకు రుణ కాలం ఏప్రిల్ 1 నుంచి జూలై 31 వరకు ఉండగా, రుణ , రుణేతర రైతుల నమోదు గడువు జూలై 31గా నిర్ణయించబడిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. వరి పంటకు రుణ కాలం ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 15 వరకు ఉండగా, నమోదు గడువు ఆగస్టు 15గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రబీ 2026-27 సీజన్‌లో వరి మినహా అన్ని నోటిఫైడ్ పంటలకు రుణ కాలం అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 15 వరకు ఉండగా, నమోదు గడువు డిసెంబర్ 15గా నిర్ణయించారని, వరి పంటకు రుణ కాలం అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు ఉండగా నమోదు గడువు డిసెంబర్ 31గా నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే, పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద ఖరీఫ్-2026 సీజన్‌లో అన్ని నోటిఫైడ్ పంటలకు రుణ కాలం ఏప్రిల్ 1 నుంచి జూలై 15 వరకు ఉండగా, నమోదు గడువు జూలై 15గా నిర్ణయించారని చెప్పారు. రబీ 2026-27 సీజన్‌లో జీడిమామిడి పంటకు రుణ కాలం అక్టోబర్ 1 నుంచి నవంబర్ 15 వరకు ఉండగా, నమోదు గడువు నవంబర్ 15గా, టమాటా పంటకు రుణ కాలం అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 15 వరకు ఉండగా, నమోదు గడువు డిసెంబర్ 15గా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఉభయ పథకాలలోనూ రుణ రైతులు నమోదు గడువుకు కనీసం ఏడు రోజుల ముందుగా ఆప్ట్-అవుట్ ప్రకటన సమర్పించాల్సి ఉంటుందని, బీమా చేసిన పంటలో మార్పులు ఉంటే ప్రీమియం డెబిట్‌కు రెండు పనిదినాల ముందే సంబంధిత సమాచారాన్ని అందించాలని తెలిపారు. అలాగే, బ్యాంకులు ప్రీమియం చెల్లించి నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేయడం సహా సీజనాలిటీ నిబంధనలు యథాతథంగా కొనసాగుతాయని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.
**రుణ రైతులకు 'ఆప్ట్-అవుట్' విధానంలో బీమా :** సీజనల్ పంట రుణం లేదా కిసాన్ క్రెడిట్ కార్డు పరిమితి మంజూరైన లేదా పునరుద్ధరించిన రైతులు సంబంధిత బ్యాంకు శాఖల ద్వారా ఆటోమేటిక్‌గా పంట బీమా పరిధిలోకి వస్తారని మంత్రి తెలిపారు. బీమా వద్దనుకునే రైతులు మాత్రమే నమోదు గడువుకు కనీసం ఏడు రోజుల ముందుగా రుణం మంజూరు చేసిన బ్యాంకు శాఖకు లిఖితపూర్వకంగా 'ఆప్ట్-అవుట్' ప్రకటన సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. అలాంటి ప్రకటన సమర్పించని రైతులందరూ స్వయంచాలకంగా బీమా పరిధిలోకి వస్తారని స్పష్టం చేశారు. నోటిఫై చేసిన పంటలకు సంబంధించి రుణ రైతులకు బీమా వర్తింపజేయడం తప్పనిసరి అని పేర్కొన్న మంత్రి, బ్యాంకులు రైతు చెల్లించాల్సిన ప్రీమియం వాటాను డెబిట్ చేసి, వాస్తవ సాగు విస్తీర్ణం ఆధారంగా పంటల వారీగా బీమా నమోదు చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోపు ప్రీమియంతో కూడిన సమగ్ర వివరాలను బీమా సంస్థలకు పంపించడంతో పాటు NCIPలో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. నిర్ణీత సమయంలో ప్రీమియం, రైతుల వివరాలను బీమా సంస్థలకు పంపించడంలో బ్యాంకులు లేదా ూాజూ విఫలమైతే, బీమా రక్షణ కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాల్సిన బాధ్యత ఆయా బ్యాంకులదేనని స్పష్టం చేశారు.
**రుణేతర రైతులకు స్వచ్ఛంద నమోదు :** రుణేతర రైతులు స్వచ్ఛందంగా పథకంలో నమోదు చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. ఇందుకోసం యజమాని రైతులు రికార్డ్ ఆఫ్ రైట్స్, ల్యాండ్ పొజెషన్ సర్టిఫికేట్ లేదా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఇతర భూ రికార్డులను సమర్పించాల్సి ఉంటుంది. కౌలు రైతులు, భాగస్వామ్య సాగుదారులు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన ఒప్పంద పత్రాలు లేదా సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. అదనంగా బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌బుక్ ప్రతులు, రైతు స్వీయ పంట సాగు ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలతో సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి NCIPలో నమోదు చేస్తారని, అసంపూర్ణ దరఖాస్తులు లేదా అవసరమైన పత్రాలు లేని దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోరని మంత్రి తెలిపారు.

నమోదు చేసుకునేందుకు పలు మార్గాలు

రైతులు వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకులు, కామన్ సర్వీస్ సెంటర్లు, ఎంపికైన బీమా కంపెనీలు మరియు వాటి అధీకృత మధ్యవర్తులు లేదా ఏజెంట్లు, నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ , క్రాప్ ఇన్సూరెన్స్ మొబైల్ యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. జుాజ కేంద్రాల ద్వారా నమోదు చేసుకునే రైతుల నుంచి ఎలాంటి అదనపు రుసుము వసూలు చేయరని ఆయన వెల్లడించారు.
**అగ్రిస్టాక్ ఫార్మర్ ఐడి, ఇ-పంట ధృవీకరణ తప్పనిసరి :** కేంద్ర ప్రభుత్వ నిర్దేశాల మేరకు 2026-27 సంవత్సరానికి PMFBY, RWBCIS పథకాలలో నమోదుకు అగ్రిస్టాక్ ఫార్మర్ రిజిస్ట్రీ కింద చెల్లుబాటు అయ్యే ఫార్మర్ ఐడి తప్పనిసరి అని మంత్రి తెలిపారు. అయితే, ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరిందని, తుది ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నామని వెల్లడించారు. కేంద్రం నుంచి మినహాయింపు ఉత్తర్వులు అందేవరకు ఫార్మర్ ఐడి నిబంధన మేరకే నమోదు ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు. అలాగే, రైతుల నమోదు వివరాలను ప్రస్తుత సీజన్ ఇ-పంట (డిజిటల్ క్రాప్ సర్వే) వివరాలతో ధృవీకరించే విధానం కూడా 2026-27 సంవత్సరానికి కొనసాగుతుందని తెలిపారు. రైతులపై ప్రీమియం భారం తగ్గించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ప్రీమియం సబ్సిడీని అందిస్తున్నదని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన గడువులోపు అర్హులైన రైతులందరూ పంటల బీమా పథకాలలో నమోదు చేసుకుని ప్రకృతి వైపరీత్యాలు, ప్రతికూల పరిస్థితుల నుంచి తమ పంటలకు ఆర్థిక రక్షణ కల్పించుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు.

# ఏపీకి రూ.2,545 కోట్ల ఊతం

(మొదటి పేజీ తరువాయి)

కోట్లు మెటీరియల్ వ్యయాలకు, రూ. 188.50 కోట్లు పరిపాలనా వ్యయాలకు కేటాయించారు. ఈ నిధులను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా గ్రామీణాభివృద్ధికి మరింత వేగం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.

ఇటీవల తిరుపతిలో విబీ–జీ రామ్–జీ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ఘనంగా ప్రారంభించినట్లు గుర్తు చేసిన మంత్రి, ఈ పథకం గ్రామీణాభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి, శాశ్వత ఆస్తుల నిర్మాణం, ఉపాధి అవకాశాల విస్తరణకు ఈ పథకాన్ని సమర్థవంతంగా వినియోగించనున్నట్లు వెల్లడించారు.

గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, నీటి సంరక్షణ పనులు, మౌలిక సదుపాయాల కల్పన వంటి శాశ్వత ఆస్తుల నిర్మాణానికి ఈ నిధులు ఉపయోగపడతాయని తెలిపారు. అదే సమయంలో గ్రామీణ ప్రజలకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మార్గదర్శకత్వంలో విబీ–జీ రామ్–జీ పథకం దేశవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతోందని తెలిపారు.

అలాగే రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఈ నిధులను ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడేలా సమర్థవంతంగా వినియోగిస్తామని డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఉపాధి కల్పన, స్థిరమైన జీవనోపాధి అవకాశాల సృష్టి ద్వారా వికసిత్ భారత్–2047 లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# హిందూ ధర్మంపై దుష్ప్రచారం సహించబోం

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని యామిని శర్మ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** హేతువాదం, నాస్తికత్వం, వాక్ స్వాతంత్ర్యం పేరుతో హిందూ దేవుళ్లను, హిందూ ధర్మాన్ని అవమానించడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని యామిని శర్మ అన్నారు. కొందరు వ్యక్తులు పదేపదే హిందూ ధర్మాన్ని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేయడం సమాజంలో మత విద్వేషాలను రెచ్చగొట్టే చర్యగా అభివర్ణించారు.

మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను సైతం పదేపదే లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం వెనుక దురుద్దేశం ఉందని ఆరోపించారు. హేతువాదం, నాస్తికత్వం, వాక్ స్వాతంత్ర్యం పేరుతో హిందూ దేవుళ్లను దుర్భాషలాడే అధికారం రాజ్యాంగం ఎవరికీ కల్పించలేదని పేర్కొన్నారు.

ప్రకాశ్ రాజ్, తులసి చందు, జోసెఫ్ తదితరులు హిందూ ధర్మంపై, దేశంపై పదేపదే విషపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించిన యామిని శర్మ, అలాంటి వ్యాఖ్యలను ప్రజలు సహించరని హెచ్చరించారు. ప్రజల మధ్య, మతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేస్తే చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు.

దళిత క్రైస్తవ సభ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో హిందూ ధర్మాన్ని, కూటమి ప్రభుత్వాన్ని, పవన్ కళ్యాణ్‌ను విమర్శించడం పూర్తిగా దురుద్దేశపూరిత చర్యేనని యామిని శర్మ ఆరోపించారు. మత సామరస్యాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను మానుకోవాలని, రాజ్యాంగ విలువలు, అన్ని మతాల విశ్వాసాలను గౌరవించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆమె పేర్కొన్నారు.

# ఎస్ఐఆర్ నిర్వహణ లోపాలపై రాష్ట్ర బీజేపీ అసహనం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)–2026 కార్యక్రమంలో తలెత్తిన నిర్వహణ లోపాలను వెంటనే సరిదిద్ది, పారదర్శకంగా, నిష్పాక్షికంగా, అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ కు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. రమేష్ నాయుడు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమం ఉద్దేశం సమగ్ర, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించడమే అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో పలు నిర్వహణ సమస్యలు తలెత్తడంతో ఓటర్లు, ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములైన రాజకీయ పార్టీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వినతిలో పేర్కొన్నారు.

రాష్ట్రంలోని అనేక పోలింగ్ కేంద్రాల్లో సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఓటర్లు అవసరమైన సమాచారం, మార్గదర్శకత్వం పొందలేకపోతున్నారని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, తొలిసారి ఓటర్లుగా నమోదు చేసుకునే వారు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అలాగే ఓటర్ల వివరాల సేకరణకు నిర్ణయించిన గడువు సరిపోవడం లేదని, ఫారాల పంపిణీలో జాప్యం, ప్రజల్లో అవగాహన లోపం, ఎన్నికల సిబ్బంది కొరత వంటి కారణాలతో అనేక మంది నిర్ణీత సమయంలో తమ వివరాలను సమర్పించలేకపోతున్నారని పేర్కొంటూ గడువును పొడిగించాలని కోరారు.

బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు) అనేక ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో లేకపోవడం వల్ల ఫారాల పంపిణీ, సందేహాల నివృత్తి, దరఖాస్తుల స్వీకరణ వంటి సేవలు సక్రమంగా అందడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. బీఎల్‌వోల పనిభారాన్ని సమీక్షించి, వారికి తగిన సమయం కల్పించడంతో పాటు పోలింగ్ కేంద్రాల్లో నిర్దేశిత సమయాల్లో విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అనేక పోలింగ్ కేంద్రాల్లో ఎన్యుమరేషన్ ఫారాల కొరత ఉందని, అవసరమైన సంఖ్యలో ఫారాలను అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన మార్గదర్శకాలు, షెడ్యూల్‌లు, విధానపరమైన మార్పులు రాజకీయ పార్టీలకు సకాలంలో అందడం లేదని, దీంతో సమన్వయ లోపం, అనవసర గందరగోళం ఏర్పడుతోందని పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన సమాచారాన్ని అన్ని రాజకీయ పార్టీలకు ఒకే విధంగా, సకాలంలో అందించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ మరింత పారదర్శకంగా సాగుతుందని అభిప్రాయపడ్డారు.

ఈ నేపథ్యంలో ప్రతి పోలింగ్ కేంద్రంలో సహాయక కేంద్రాల ఏర్పాటు, ఓటర్ల వివరాల సేకరణ గడువు పొడిగింపు, బీఎల్‌వోలు అందుబాటులో ఉండేలా చర్యలు, తగిన సంఖ్యలో ఫారాల సరఫరా, రాజకీయ పార్టీలతో సమన్వయ వ్యవస్థ ఏర్పాటు, ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించేలా అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని ప్రధాన ఎన్నికల అధికారిని ఎన్. రమేష్ నాయుడు కోరారు. ఈ వినతిపత్రం ప్రతిని భారత ఎన్నికల కమిషన్ ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు కూడా పంపించారు.

# హస్తకళల పరిరక్షణ... కూటమి ప్రభుత్వం బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)



చెందిన ప్రముఖ హస్తకళాకారులు ఉత్పత్తి చేసిన కళారూపాలను ప్రదర్శనకు ఉంచారు.

ఈ సందర్భంగా తోలుబొమ్మలాట కళాకారులు ప్రదర్శించిన రామాయణంలోని రావణ సంహార ఘట్టాన్ని తిలకించారు. సతీమణి అన్నా కొణిదెల కోసం ఉప్పాడ జాందానీ చీరలు కొనుగోలు చేశారు. ప్రతి స్టాల్‌ను సందర్శిస్తూ హస్తకళా ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ కళాకారులకు తనవంతు ప్రోత్సాహం అందించారు. కళాకారులతో మమేకమవుతూ వారి నైపుణ్యాన్ని అభినందించారు. కళాకారుల సాధకబాధకాలు అడిగి తెలుసుకున్నారు. వారికి అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కళాకారుల కోరిక మేరకు క్లస్టర్ల వారీగా గ్రూపు ఫోటోలు దిగారు. మన రాష్ట్రానికే సొంతమైన హస్తకళల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు.

**తోలుబొమ్మలాటలో ఆకట్టుకున్న రావణ సంహార ఘట్టం :** ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవంలో మొదటి అడుగుగా కాకినాడకు చెందిన తోలుబొమ్మల కళాకారులు ఏర్పాటు చేసిన స్టాల్‌ను పవన్ కళ్యాణ్ సందర్శించారు. సనాతన ధర్మ ఔన్నత్యాన్ని తెలియజేసే విధంగా రూపొందించిన రామాయణ, భారత, భాగవత కళారూపాలను పరిశీలించారు. తోలుబొమ్మలాట కళాకారులు ప్రదర్శించిన రావణ సంహార ఘట్టం అందర్నీ ఆకట్టుకుంది. తరతరాలుగా తోలుబొమ్మలాటను నమ్ముకుని జీవనాధారం సాగిస్తున్న తమ కుటుంబాలు నేడు అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనలు ఇచ్చే స్థితికి చేరుకున్నట్టు కళాకారులు వివరించారు. తోలుబొమ్మలాట ఔన్నత్యాన్ని చాటేలా రాబోయే గోదావరి పుష్కరాల్లో తోలుబొమ్మలాట ప్రదర్శన ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

**అన్నా కొణిదల కోసం ఉప్పాడ చీరలు :** అనంతరం ఉప్పాడ చీరల స్టాల్‌ను పవన్ కళ్యాణ్ సందర్శించారు. మూడు ఉప్పాడ జాందానీ పట్టు చీరలను సతీమణి అన్నా కొణిదెల కోసం, తన కోసం కొన్ని వస్త్రాలు కొనుగోలు చేశారు. అ–రటిపీచుతో తయారు చేసిన హ్యాండ్‌బ్యాగులు, ఫైల్స్ తదితర పర్యావరణహిత ఉత్పత్తులను ఆసక్తిగా తిలకించారు. తయారీ విధానాన్ని కళాకారులను అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి హ్యాండ్‌బ్యాగ్ కొనుగోలు చేశారు.

**స్టాళ్లు సందర్శిస్తూ.. సాధకబాధకాలు తెలుసుకుంటూ... :** తిరుపతి వుడ్ కార్వింగ్ కళాకారులు రూపొందించిన చెక్క బొమ్మల స్టాల్‌ను పవన్ కళ్యాణ్ సందర్శించి, అద్భుత కళాఖండాలను మలచిన కళాకారులను ప్రశంసించారు. వారి నుంచి వెంకటేశ్వరస్వామి ప్రతిమను కొనుగోలు చేశారు.

శ్రీకాళహస్తి కలంకారీ వస్త్రాల స్టాల్‌లో పెన్ కలంకారీ ఆర్ట్‌తో రూపొందించిన వస్త్రాలు, దుప్పట్లు పవన్ కళ్యాణ్ను ఆకట్టుకున్నాయి. కలంకారీ చేనేత కళాకారుల కష్టం ప్రతి ఒక్కరూ తెలుసుకునేలా వీడియో డాక్యుమెంటరీలు రూపొందించాలని అధికారులకు సూచించారు.

పెడన కలంకారీ స్టాల్ సందర్శనలో తమకు ప్రభుత్వం నుంచి ఇండిగో కలర్స్, కామన్ ఫెసిలిటీ సెంటర్ల అవసరం ఉందని కళాకారులు ప్రస్తావించగా, సౌకర్యాల కల్పనకు భరోసా ఇచ్చారు.

నరసాపురం లేస్ స్టాళ్లను సందర్శించిన సందర్భంగా కళాకారులు తమకు ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలను వివరించారు. కళాకారుల ఆరోగ్య పరిరక్షణ దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. క్లస్టర్ల వారీగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు.

**మన కళలకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెస్తాం :** బ్యాటరీ సహాయం లేకుండా నడిచే సైంటిఫిక్ చెక్క బొమ్మల స్టాల్ పవన్ కళ్యాణ్ను ఆకట్టుకుంది. చెక్కతో చేసిన టెలిస్కోప్ తదితర ఉత్పత్తులను ఆసక్తిగా తిలకించారు. పంచాయతీల పరిధిలోని ప్రతి పాఠశాలలో ఈ సైంటిఫిక్ బొమ్మలు ఏర్పాటు చేయాలని సూచించారు.

గిరిజన సవర కళాకారులు ఏర్పాటు చేసిన స్టాల్‌లో సుదీర్ఘ సమయం గడిపారు. సంప్రదాయ సవర కళలో పురాణ కథలతో పాటు జాతీయ నాయకుల చిత్రాలను కూడా రూపొందించాలని సూచించారు.

ఒక కళాఖండాన్ని రూపొందించిన కళాకారుడికి గుర్తింపు దక్కే విధంగా ప్రతి ఆర్ట్‌పై ప్రత్యేక క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి, అందులో కళాకారుడి పేరు, అతను రూపొందించిన కళకు సంబంధించిన కథనం పొందుపర్చాలని అధికారులకు సూచించారు.

మన కళలకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు దక్కాలని, జపాన్ తరహాలో కళాకారులను గౌరవించాలని సూచించారు.

సవర కళాకారుల కోసం విబి జీ రాం జీ పథకం కింద ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

నరసాపురం లేస్ కళాకారులు కళ్లకు ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. అలాగే చేనేత కళాకారులకు కండరాలు, ఎముకలు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, కలంకారీ కళాకారులకు శ్వాసకోశ సమస్యలు వస్తాయని వివరించారు. ప్రతి కళాకారుడు ఏకాగ్రతతో కళను మలిచే క్రమంలో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. హస్తకళాకారుల ఆరోగ్య పరిరక్షణకు క్లస్టర్ల వారీగా చర్యలు చేపట్టాలని పవన్ కళ్యాణ్ సూచించారు.

అనంతరం హస్తకళలకు పవన్ కళ్యాణ్ ఇస్తున్న ప్రాధాన్యత, కల్పిస్తున్న ప్రచారాన్ని తెలియజేసేలా ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని పరిశీలించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తదితర ప్రముఖులను కలిసిన సందర్భంగా పవన్ కళ్యాణ్ అందజేసిన హస్తకళా ఉత్పత్తులకు సంబంధించిన ఫొటోలను వివరాలతో సహా గ్యాలరీలో ప్రదర్శించారు. ఈ గ్యాలరీ ఆయనను ఆకట్టుకుంది. వివిధ క్లస్టర్ల నుంచి మహోత్సవానికి వచ్చిన హస్తకళాకారులతో గ్రూపు ఫొటోలు దిగారు.

హస్తకళల అభివృద్ధి దిశగా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఏలూరు కార్పెట్ కళాకారులు, అనంతపురం అ–రటి పీచు కళాకారుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం కింద 30 మంది చొప్పున కళాకారులను ఎంపిక చేసి వారికి రెండు నెలల పాటు శిక్షణ అందిస్తారు.

గుంటూరు, కాకినాడల్లో పునరుద్ధరించిన లేపాక్షి షోరూంలు, రాజమహేంద్రవరం విమానాశ్రయంలో నూతనంగా ఏర్పాటు చేసిన షోరూంను వర్చువల్‌గా ప్రారంభించారు.

**లేపాక్షి ఈ-కామర్స్ యాప్ ఆవిష్కరణ :** హస్తకళా మహోత్సవం వేదిక నుంచి పవన్ కళ్యాణ్ లేపాక్షి ఈ–కామర్స్ యాప్‌ను ఆవిష్కరించారు. ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్‌తో పాటు యాపిల్ యాప్ స్టోర్‌లోనూ అందుబాటులో ఉంటుంది. ఈ యాప్ ద్వారా రాష్ట్ర హస్తకళా ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్త మార్కెటింగ్ అవకాశాలు దక్కనున్నాయి.

దీంతో పాటు రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వివిధ క్లస్టర్లలో ఏర్పాటు చేసిన 100 ఉద్యమ్ వర్క్‌షాప్‌లను ప్రారంభించారు. 2 వేల మంది కళాకారులను అధికారిక పారిశ్రామిక వ్యవస్థలోకి తీసుకురావడం లక్ష్యంగా ఈ వర్క్‌షాప్‌లను నిర్వహిస్తున్నారు.

అనంతరం సంప్రదాయ హస్తకళల పరిరక్షణ, ప్రచారంలో విశేష కృషి చేసిన పలువురిని సత్కరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, జౌళి, వస్త్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎస్. సవిత, విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్, రాష్ట్ర చేనేత, హస్తకళల విభాగం సలహాదారు సుచిత్ర ఎల్లా, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, పీసీసీఎఫ్ పి. వి. చలపతిరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కల్లుగీత కార్మికులకు భరోసా

(మొదటి పేజీ తరువాయి)

చేసి వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు. హార్టీకల్చర్ యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన నీరా తయారీ కేంద్రాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. యూనివర్శిటీ ఆవరణలో దేశంలోని పలు ప్రాంతాల నుండి తీసుకొచ్చి పెంచుతున్న తాటి చెట్లను పరిశీలించారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నీరా (కల్లు గీత) కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. తాటి, కొబ్బరి, జీరుగు చెట్ల ద్వారా సేకరించిన నీరా (కల్లు) ద్వారా అనేక రకాల ప్రయోజనాలు ఉన్నాయన్నారు. నీరా లో మధుమేహ రోగ నియంత్రణ, విటమిన్లు,ఖనిజాలు శరీరానికి ఉపయోగపడే అనేక రకాల ఖనిజాలు, విటమిన్లు లభిస్తాయన్నారు. నీరా ను ప్రాసెసింగ్ చేసి నిల్వ కూడా చేయటంతో కాలానుగుణంగా కాకుండా నీరా దొరకని కాలంలో కూడా నీరా లభ్యమయ్యేలా చేయొచ్చన్నారు. ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి మాట్లాడుతూ నీరా సేవించడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగు తుందన్నారు. జుట్టు రాలే సమస్య కూడా తగ్గుతుందన్నారు. నీరా ద్వారా ఆయుర్వేద వైద్యంలో కూడా అనేక రకాలుగా వినియోగిస్తారని తెలిపారు. కేవలం ఆయా చెట్ల ద్వారా నీరా మాత్రమే కాకుండా తాటి బెల్లం, జీరుగు బెల్లం, తదితర ఉత్పత్తులు చేయొచ్చని ఆయా కార్మికులకు మంచి ఆదాయ వనరుగా ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. ఆయా సేకరణ దారులు కేవలం ఆయా కాలాల్లో మాత్రమే కాకుండా స్థిరమైన ఆదాయ వనరుగా ఉపయోగించుకోవచ్చన్నారు. దీనిని ఒక పరిశ్రమగా చేసుకుంటూ అనేక కుటుంబాలు జీవనోపాధి పొందేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో వీరిని తీర్చిదిద్దాలని ఒక ప్రణాళిక చేపట్టినట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన బ్రోచర్ ను విడుదల చేసారు. కృషి విజ్ఞాన కేంద్రంలో తయారు చేస్తున్న తాటి, జీరుగు తదితర రకాల ఉత్పత్తులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ పరిశ్రమను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అంతా అధునాతన పద్ధతుల్లో దీనిని తయారు మొదలు, నిల్వ, వ్యాపార విస్తరణ తదితర అంశాలను మంత్రి కొల్లురవీంద్ర క్షుణ్ణంగా వివరించారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సీతంశెట్టి వెంకటేశ్వర రావు, వంతల రాజేశ్వరి, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ సభ్యులు షేక్ సుభానీ, APIIC డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, పోలవరం జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ కొత్తమాసు దినేష్ కుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారి స్వాతి, ఉద్యాన శాఖ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ధనుంజయరావు, ఎక్సైజ్ శాఖ కమిషనర్ శ్రీ చామకూరి శ్రీధర్ , ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు, వాడపల్లి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు కొల్లిబోయిన శ్రీనివాస్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంత మోహన్, సీతపల్లి దేవస్థానం చైర్మన్ కారం బాపన్న దొర, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు అడబాల బాపిరాజు, నియోజక వర్గ ఎస్టీ విభాగం అధ్యక్షులు పండా బాపన్న దొర అనే బాబీ, సీతపల్లి దేవస్థానం సభ్యులు సిద్ధా వెంకన్న దొర, గంగవరం సొసైటీ అధ్యక్షుడు పాము అర్జున్, గంగవరం మండల పార్టీ అధ్యక్షులు పల్లాల వెంకటరెడ్డి, మారేడుమిల్లి మండల పార్టీ అధ్యక్షులు గురుకు శేషుకుమార్,గోళ్ళ చంటిబాబు, మాజీ సర్పంచ్ నిరంజనీదేవి, మాజీ ఎంపీపీ తీగల ప్రభ, సాధల సత్య, నియోజక వర్గ బీసీ విభాగం ఉపాధ్యక్షులు మాకిరెడ్డి లోవరాజు, పలువురు మండల పార్టీ అధ్యక్షులు, కూటమి పార్టీ నేతలు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేలకు జేఏసీ వినతి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ గుంటూరు జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ) ప్రతినిధులు గుంటూరు పశ్చిమ, ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గ ఎమ్మెల్యేలకు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు.

జేఏసీ జిల్లా చైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు, కన్వీనర్ ఎం.డి. ఖాలీద్, కార్యదర్శుల నాయకత్వంలో సభ్య సంఘాల ప్రతినిధులు గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌ను కలిసి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఆర్టీసీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ, సరెండర్ లీవుల నగదు చెల్లింపు, నాలుగు కరవు భత్యాల విడుదల, ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష మినహాయింపు, సీపీఎస్ రద్దు తదితర పది ప్రధాన డిమాండ్లను వెంటనే పరిష్కరించేలా ప్రభుత్వ స్థాయిలో చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగూర్ షరీఫ్, గుంటూరు నగర శాఖ చైర్మన్ చింతల కళ్యాణకుమార్, ఎస్సీ వెల్ఫేర్ వార్డెన్స్ సంఘం అధ్యక్షుడు కర్లపూడి సుభాషన్, మల్లికార్జున, క్లాస్–4 ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు వినోద్, ఇరిగేషన్ శాఖకు చెందిన నరసింహారావు, శ్రీనివాస్, పే అండ్ అకౌంట్స్ శాఖకు చెందిన నాగేశ్వరరావుతో పాటు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి పేదకూ పక్కా ఇల్లు

(మొదటి పేజీ తరువాయి)



పేదల సొంతింటి కలను సాకారం చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక ప్రాధాన్యంతో నిధులు కేటాయించడమే కాకుండా కేంద్రం నుంచి అదనపు నిధులు సాధించేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు.

మంగళవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, 2014–19 మధ్య కాలంలో 13,04,516 ఇళ్లు మంజూరు చేసి రూ. 10,194 కోట్లు వ్యయం చేసి 8,04,853 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. అదే సమయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం కింద రూ. 712.83 కోట్లు అందించామని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఇంటికి రూ. 50 వేల చొప్పున, గిరిజనులకు రూ. 75 వేల చొప్పున ప్రత్యేక సహాయం అందించినట్లు వివరించారు.

గత ప్రభుత్వ హయాంలో 18.61 లక్షల ఇళ్లు మంజూరు చేసినప్పటికీ, 2024 మే 31 నాటికి కేవలం 6,70,636 ఇళ్లు మాత్రమే పూర్తి చేశారని విమర్శించారు. రూ. 9,588 కోట్లు ఖర్చు చేసినప్పటికీ నిర్మాణాలు ఆశించిన స్థాయిలో జరగలేదని అన్నారు. అంతేకాకుండా గతంలో మంజూరైన 4.36 లక్షల ఇళ్లను రద్దు చేయడం వల్ల వేలాది మంది పేదలు నష్టపోయారని ఆరోపించారు.

రాష్ట్రవ్యాప్తంగా మహిళల పేరిట 20,29,450 ఇంటి స్థలాలు పంపిణీ చేసినప్పటికీ, వాటిలో 7,89,550 మందికే ఇళ్లు మంజూరయ్యాయని, ఇంకా 12,39,900 స్థలాల్లో గృహాల మంజూరు జరగాల్సి ఉందని తెలిపారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గృహ నిర్మాణాలను వేగవంతం చేసినట్లు మంత్రి చెప్పారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్, గ్రామీణ, పీఎం–జనమన్ పథకాల కింద మొత్తం 86,714 కొత్త ఇళు ్ల మంజూరయ్యాయని వెల్లడించారు. ఇప్పటి వరకు రూ. 2,102 కోట్లు వ్యయం చేసి 4,56,536 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు.

పక్కా గృహాల కోసం 10.42 లక్షల దరఖాస్తులు అందగా, పరిశీలన అనంతరం సుమారు 9.50 లక్షల మంది అర్హులుగా గుర్తించామని చెప్పారు. తొలి విడతలో కేంద్రం 74,812 ఇళ్లను మంజూరు చేసిందని, భవిష్యత్తులో అర్హుల సంఖ్యకు అనుగుణంగా మరిన్ని ఇళ్లు మంజూరు చేయిస్తామని తెలిపారు.

పీఎంఏవై అర్బన్ 2.0 కింద ఒక్కో ఇంటి వ్యయాన్ని రూ. 2.50 లక్షలుగా నిర్ణయించగా, అందులో కేంద్రం రూ. 1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 1 లక్ష చొప్పున అందజేస్తుందని చెప్పారు. అవసరమైతే స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. మరుగుదొడ్ల నిర్మాణానికి స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా అదనపు సహాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

పీఎంఏవై గ్రామీణ పథకం కింద ఒక్కో ఇంటికి రూ. 2.39 లక్షల వ్యయం నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో కేంద్రం రూ. 72 వేల, రాష్ట్ర ప్రభుత్వం రూ. 48 వేల అందించడంతో పాటు రూ. 80 వేల వడ్డీలేని రుణం, ఉపాధి హామీ పథకం కింద రూ. 39 వేల వరకు ఆర్థిక సహాయం లభిస్తుందని వివరించారు.

# 2027 గడువులోపే పోలవరం పూర్తి !

(మొదటి పేజీ తరువాయి)

పనులను వేగంగా కొనసాగిస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. మంగళవారం ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన ఆయన, ప్రతి పని ప్రణాళికాబద్ధంగా, పారదర్శకంగా సాగుతోందన్నారు. 2014–19 మధ్య పోలవరం పనులు 72 శాతం పూర్తికాగా, 2019–24 మధ్య కేవలం రెండు శాతం మాత్రమే పురోగతి నమోదైందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లలోనే మరో 15 శాతం పనులు పూర్తిచేశామని చెప్పారు. దెబ్బతిన్న డయాఫ్రం వాల్ స్థానంలో రూ. 990 కోట్ల వ్యయంతో కొత్త డయాఫ్రం వాల్‌ను 440 రోజుల్లో పూర్తి చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.

ప్రాజెక్టులో కీలకమైన ఎగువ కాఫర్ డ్యాంకు రక్షణగా నిర్మిస్తున్న బట్రస్ డ్యాం పనులు పూర్తయ్యాయని, దీంతో వర్షాకాలంలో కూడా నిర్మాణ పనులకు అంతరాయం ఉండదన్నారు. ప్రధాన డ్యాంకు సంబంధించిన గ్యాప్–1 పనులు 48 శాతం, గ్యాప్–2 పనులు 29 శాతం పూర్తయ్యాయని తెలిపారు. వర్షాకాలంలో పనులు నిరాటంకంగా సాగేందుకు 8.5 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని, అవసరమైన రాక్‌లో 13 లక్షల క్యూబిక్ మీటర్లను ముందుగానే సిద్ధం చేశామని వెల్లడించారు. కుడి, ఎడమ కాలువలకు సంబంధించిన నాలుగు టన్నెల్లలో మూడు పూర్తయ్యాయని, చివరి టన్నెల్ పనులు మరో పది రోజుల్లో పూర్తవుతాయని చెప్పారు.

పోలవరం కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులు త్యాగధనులని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భావిస్తున్నారని మంత్రి అన్నారు. అందుకే ఇప్పటివరకు వారికి రూ. 2,250 కోట్ల పరిహారం అందించగా, త్వరలో మరో రూ. 200 కోట్లు విడుదల చేయనున్నట్లు తెలిపారు. పునరావాస కాలనీల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన వేగంగా కొనసాగుతోందని పేర్కొన్నారు.

పోలవరాన్ని కేవలం సాగునీటి ప్రాజెక్టుగానే కాకుండా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, రూ. 500 కోట్లతో పర్యాటక అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. పాపికొండల మీదుగా భద్రాచలం వరకు బోటు విహారాలు, కాటేజీలు, అనుసంధాన రహదారులు, ఐకానిక్ వంతెనల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు.

ఎల్‌నినో, సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. 'జలధార–జలహారతి' కార్యక్రమం ద్వారా డ్రైన్లు, కాలువలను చెరువులతో అనుసంధానిస్తూ ప్రతి నీటి బొట్టును సంరక్షించే చర్యలు చేపడుతున్నామని చెప్పారు. భూగర్భ జలమట్టం పెంపు, నీటి పొదుపు, సమర్థ నీటి యాజమాన్యమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. 70 ఏళ్లలో తొలిసారిగా జూలై 5 వరకు గోదావరికి పెద్దగా ఇన్‌ఫ్లో లేకపోయినా, ప్రస్తుతం ప్రవాహం పెరుగుతోందని, రాత్రికి లక్ష క్యూసెక్కుల వరకు నీరు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

బుధవారం ఉదయం పట్టిసీమ, తాడిపూడి ఎత్తిపోతల పథకాల మోటార్లను ప్రారంభించి నీటి విడుదల చేపడతామని మంత్రి ప్రకటించారు. నీటిని అవసరాలకు అనుగుణంగా పొదుపుగా వినియోగిస్తూ రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం పోలవరం జలవిద్యుత్ కేంద్రం పనులను పరిశీలించిన మంత్రి, ఈ వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్‌అండ్ఆర్, గోదావరి డెల్టా ప్రక్షాళన, గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

## జర్నలిస్టు కుటుంబాల పిల్లలకు ఫీజులలో రాయితీ కల్పించాలని నిరసన ధర్నా



**మిర్యాలగూడ, జూలై 07 (జర్నలిస్ట్ ఫైల్) :** టీయూడబ్ల్యూజే (ఐజేయు) నల్లగొండ జిల్లా కమిటీ పిలుపుమేరకు సోమవారం జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కలిమెల నాగయ్య,టీయూడబ్ల్యూజే జిల్లా ప్రచార కార్యదర్శి ఎండిఅస్లాంలఆధ్వర్యంలోమిర్యాలగూడ టీయూడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ డీ ఏఓ శ్రీనివాస శర్మ, మండల విద్యాధికారి ధర్మానాయక్ లకు వినతి పత్రాలు సమర్పించారు. జర్నలిస్టు కుటుంబాల పిల్లలకు పాఠశాలలలో ఫీజు రాయితీ కల్పించాలని కోరారు. ఫీజు రాయితీ సర్కులర్ జారీ చేసేంతవరకు ఉద్యమాలుచేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోమిర్యాలగూడ డివిజన్ టీయూడబ్ల్యూజే (ఐజేయు) అధ్యక్షులు బాలాజీ రావు, ప్రధాన కార్యదర్శిరమేష్.సీనియర్ జర్నలిస్టులో నామిరెడ్డి నరేందర్ రెడ్డి, ఖాజా నాజీముద్దీన్, సుమన్, కిషోర్ జిల్లా ప్రచార కార్యదర్శి కాతోజు నాగ చారి,,బండ వేణుగోపాల్ రెడ్డి, అశోక్, రాచకొండ రమేష్, సునీల్ చౌదరి, కిషోర్, శీను, కాట్రాజ్ అశోక్, నక్క శ్రీను, వెంకన్న, హరీష్ బాబు, తోఫిక్, కట్ట బాబు, షేక్ వసీం, రాయించు నగేష్ తో పాటు పలువురు జర్నలిస్టులుపాల్గొన్నారు.

## ట్రాక్టర్ చోరీ కేసు ఛేదించిన పోలీసులు:నిందితుడి అరెస్టు..




**హుజూర్ నగర్ , జూలై 07 (జర్నలిస్ట్ ఫైల్) :** సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన ట్రాక్టర్ చోరీ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. కేసులో నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చరమంద రాజు తెలిపారు.సీఐ వెల్లడించిన వివరాల ప్రకారం.. జూన్ 29న అమరవరం గ్రామానికి చెందిన కొప్పుల వాసిరెడ్డి తన ఇంటి ఆవరణలో పార్క్ చేసిన జాన్ డీర్ ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. మరుసటి రోజు ఉదయం ట్రాక్టర్ కనిపించకపోవడంతో బాధితుడు హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ చలికంటి నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా మఠంపల్లి మండలం అవిరేణికుంట సమీపంలో మట్టిలో దిగబడిన స్థితిలో ట్రాక్టర్‌ను పోలీసులు గుర్తించారు. అనంతరం సాంకేతిక ఆధారాలతో విచారణ చేపట్టగా, అమరవరం గ్రామానికి చెందిన చిరంజీవి అనే వ్యక్తే ట్రాక్టర్‌ను దొంగిలించినట్లు నిర్ధారణ అయింది. సోమవారం అతడిని అతని నివాసంలో అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్లు సీఐ తెలిపారు.ఈ సందర్భంగా సీఐ చరమంద రాజు రైతులకు పలు సూచనలు చేశారు. నాట్ల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ట్రాక్టర్లు, ఇంజిన్లు, నాగళ్లు, ఇతర వ్యవసాయ పరికరాలను పొలాల్లో నిర్లక్ష్యంగా వదిలివేయకుండా సురక్షిత ప్రాంతాల్లో భద్రపరచుకోవాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద ఘటనలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది జానీ, గోలి శంభయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లుపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో ఫిర్యాదు



**గరిడేపల్లి, జూలై 07 (జర్నలిస్ట్ ఫైల్) :** గరిడేపల్లి మండల సరిహద్దు గ్రామమైన రాయినిగూడెం-హుజూర్‌నగర్ మండలాల సరిహద్దులో జాతీయ రహదారి--167కు ఆనుకుని ఉన్న శ్రీ విజయ్ చందర్ రైస్ ఇండస్ట్రీస్ నిబంధనలను పాటించకుండా, తగిన భద్రతా చర్యలు లేకుండా నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పలువురు మండలవాసులు ఫిర్యాదు చేశారు.అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ, జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న రైస్ మిల్లు నుంచి వరిపొట్టు, దుమ్ము, ధూళి అధికంగా ఎగిరి రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని తెలిపారు. ఈ కారణంగా ఇప్పటికే పలు రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు పేర్కొన్నారు. గత ఏడాది జూన్‌లో జరిగిన ప్రమాదంలో ఓ మండలవాసి ప్రాణాలు కోల్పోయిన ఘటనను గుర్తు చేశారు.ఇటీవల జూన్ నెలలో మిల్లు పైకప్పుపై ఏర్పాటు చేసిన సుమారు 15 రేకులతో కూడిన ఇనుప నిర్మాణం జారి రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనదారులపై పడిందని, ఈ ఘటనలో ఎన్. సైదయ్యకు రెండు కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడగా, మరో వ్యక్తికి కాలు విరగడంతో పాటు ఇంకొకరికి తలకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. మరో పది మందికి స్వల్ప గాయాలు అయినట్లు చెప్పారు. రైస్ మిల్లు వ్యర్థాల వల్ల సమీపంలోని వాగు నీరు కూడా కలుషితమవుతోందని ఆరోపించారు. రెండేళ్లుగా మిల్లు నడుస్తున్నప్పటికీ కనీస ప్రహరీ గోడ కూడా నిర్మించకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు.సంబంధిత అధికారులు మిల్లును పూర్తిస్థాయిలో పరిశీలించి, నాణ్యత ప్రమాణాలు, భద్రతా నిబంధనలు పాటించని పక్షంలో మిల్లు యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.వినతిపత్రం అందజేసిన వారిలో జీ. ఎల్లయ్య, నన్నేసాబ్, పి. దాసు, రాము, బి. వీరయ్య, జీ. సైదులు, సత్యనారాయణ రెడ్డి, శేఖర్, రాంబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించాలి

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల జూలై 07 (జర్నలిస్ట్ ఫైల్) :** కుక్కలు, పిల్లలకు తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మంచిర్యాల పట్టణంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత రేబిస్ టీకాల కార్యక్రమానికి జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డా. యాకూబ్ రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ సుదమల్ల హరికృష్ణ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెంపుడు జంతువుల యజమానులు తప్పనిసరిగా కుక్కలు, పిల్లలకు రేబిస్ టీకాలు వేయించాలని తెలిపారు. మనుషుల నుండి జంతువులకు, జంతువుల నుండి మనుషులకు జూనోటిక్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, రైతులు, పశుపోషకులు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని, జంతువులకు సకాలంలో టీకాలు వేయించాలని తెలిపారు. అనారోగ్యంతో ఉన్న జంతువులను వేరుగా ఉంచడం, పాలు, మాంసాన్ని పరిశుభ్రంగా నిర్వహించడం, చనిపోయిన జంతువులను శాస్త్రీయ పద్ధతిలో పారవేయడం, అనుమానాస్పద లక్షణాలు కనిపించినట్లయితే వెంటనే పశు వైద్యులను సంప్రదించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రేబిస్ వ్యాధి 100 శాతం నివారించ దగినదని, కుక్కలు, పిల్లలకు క్రమం తప్పకుండా రేబిస్ టీకాలు వేయించడం ద్వారా కుటుంబాలు, సమాజాన్ని సురక్షితంగా ఉంచవచ్చని తెలిపారు. ఆరోగ్యకరమైన జంతువులు - ఆరోగ్యకరమైన మనుషులు - ఆరోగ్యకరమైన సమాజం లక్ష్యంతో అందరం సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా 32 పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డా. శాంతి రేఖ, లైవ్ స్టాక్ అసిస్టెంట్ సోనియా, సహాయకులు గోవర్ధన్, గోపాలమిత్ర వేణు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

### - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**మంచిర్యాల, జూలై 07 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ లు, ఏ.ఈ.ఆర్.ఓ లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 25వ తేదీ నుండి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని, ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ తుది దశకు చేరుకుందని తెలిపారు. పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను ఓటర్లు వివరాలు నమోదు చేసిన పిదప తిరిగి తీసుకొని సంబంధిత బిఎల్ఓ యాప్ లో డిజిటలైజేషన్ చేపట్టాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలలో ఓటర్ల వివరాల నమోదుకు వాలంటీర్లను ఉపయోగించుకొని ఓటర్లకు సహాయ పడాలని తెలిపారు. డిజిటలైజేషన్ ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జూలై 20 వ తేదీ నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. డిజిటలైజేషన్ పూర్తయిన తర్వాత పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాలని, ఒక పోలింగ్ కేంద్రంలో 1 వేయి 200 ఓటర్లకు మించి ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటర్లు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా తప్పుడు సమాచారం సమర్పిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. డిజిటైజేషన్ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులకు సూపర్వైజర్లు, వాలంటీర్లు సహాయం అందించాలని తెలిపారు.
జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో నేటి వరకు 99 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ చేయడం జరిగిందని, 6.8 శాతం డిజిటలైజేషన్‌పూర్తయిందని, వచ్చే సోమవారం నాటికి 50 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేస్తామని, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పకడ్బందీగా చేపడతామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు, బూత్ స్థాయి ఏజెంట్లకు కార్యాచరణ ప్రకారంగా సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతం చేసేలా కృషి చేస్తున్నామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల భూముల్లో అటవీ అధికారుల ట్రెంచింగ్ వేయడానికి ప్రయత్నం అడ్డుకున్న రైతులు..



**మంచిర్యాల జూలై 07 (జర్నలిస్ట్ ఫైల్) :** అటవీశాఖ అధికారుల దౌర్జన్య కాండ పరంపర కొనసాగుతోంది. అమాయక దళిత, గిరిజన నీరుపేద రైతులపై కర్కశత్వం ప్రదర్శిస్తున్నారు. రోజూ ఏదో ఒక చోట ఇలాంటి దాడులు జరగడం సహజంగా మారింది. ఈ రోజు బెల్లంపల్లి నియోజకవర్గం
కన్నెపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతుల వంతు వచ్చింది. గ్రామానికి చెందిన 34 మంది దళిత, గిరిజన కుటుంబాలకు చెందిన రైతులు గత యాభై ఏళ్లుగా సర్వే నెంబర్ 88, 89 లో ఉన్న అసైన్మెంట్ భూములను సాగు చేస్తున్నారు. కొంత మందికి పట్టా పాస్ పుస్తకాలు, మరికొంత మందికి ఫైనల్ పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చారు. మరికొంత మందికి అటవీ హక్కు పత్రాలు ఇచ్చారు. కానీ ఇప్పటివరకు నిద్ర మత్తులో జోగుతున్న అటవీశాఖ అధికారులు ఇప్పుడు అమాయక రైతులపై దాడులు చేయడం హేయమైన చర్య అని బిజెపి రాష్ట్ర నేత, జడ్పీటీసీ ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యల ఏమాజి అన్నారుఈ రోజు కొత్తపల్లిలో అటవీ శాఖ అధికారులు రైతుల భూముల్లో అక్రమంగా ట్రెంచింగ్ వేయడానికి ప్రయత్నం చేశారని అన్నారు. వందలాది మంది పోలీసులు, అటవీ సిబ్బంది రైతులను భయభ్రాంతులకు గురి చేస్తూ జైళ్లకు పంపుతామని బెదిరించారు. వారికి అండగా నేనున్నానని బిజెపి రాష్ట్ర నాయకులు, సీనియర్ న్యాయవాది కొయ్యల ఏమాజి మద్దతు తెలిపారు.
ఈ సందర్భంగా కొయ్యల హేమాజీ మాట్లాడుతూ రైతుల పక్షాన అటవీశాఖ, పోలీసు అధికారులు పేదల భూముల జోలికి వస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది అని హెచ్చరించారు. రైతులపై అటవీశాఖ అధికారులు దాడులు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల, రైతుల ప్రభుత్వం అని చెప్తూ వారి పొట్ట కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల భూముల్లో అటవీశాఖ అధికారులు జోక్యం చేసుకుంటే దాడులు చేయడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. అటవీశాఖ అధికారులు జేసీబి తో ట్రెంచింగ్ వేయడానికి ప్రయత్నం చేస్తే రైతులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కేశవరెడ్డి, గోవర్ధన్, గ్రామస్థులు రవి, మహిళలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తాండూరు సిఐ దేవయ్య, ఎస్ ఐ విక్రమ్, ఎఫ్ ఆర్ ఓ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## "కాస్తు" కాలం తీసేయడానికి గల కారణం కెసిఆర్ సమాధానం చెప్పాలి

- అధికారంలో ఉన్న నాయకులు అవినీతిని తగ్గించి కరప్షన్ ను కట్టడి చేయాలి
- తెలంగాణ టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు బక్కని నరసింహులు..



**వనపర్తి, జూలై 07 (జర్నలిస్ట్ ఫైల్) :** రెవెన్యూ భూ రికార్డులలో "కాస్తు" కాలం తీసేయడానికి గల కారణాలు కేసీఆర్ సమాధానం చెప్పాలని తెలంగాణ టిడిపి రాష్ట్ర అధ్యక్షులు బక్కని నరసింహులు డిమాండ్ చేశారు. సోమవారం వనపర్తి టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ రెవెన్యూ రికార్డుల నుండి తొమ్మిదవ షెడ్యూల్లో ఉన్న "కాస్తు" కాలం దున్నేవాడిదే భూమి అనే నినాదంతో ఆనాడు రైతాంగ పోరాటం తో సాధించిన "కాస్తు" కాలం తీసేయడంతో రక్షిత కౌలుదారులు, ఈనామ్ దారులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ లో 25 లక్షల ఎకరాల భూమి అన్యాక్రాంతమైందని స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఆనాటి ప్రభుత్వాలు పెండింగ్ లో పెట్టిన 1 లక్ష 25 వేల పెండింగ్ ఫైల్ లనుసెక్రెటరేట్ లో క్లియర్ చేసిన గొప్ప పరిపాలన దక్షకుడు నారా చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. పాలమూరు జిల్లాలో 53 సార్లు పర్యటించి, 18 రోజులు పాదయాత్రతో ప్రజల సమస్యలను తెలుసుకోవడం చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఆయన పాలన కొనసాగించారని గుర్తు చేశారు. అధికారంలో ఉన్న నాయకులు అవినీతిని తగ్గించి కరప్షన్ ను కట్టడి చేయాలని హితవు పలికారు. ప్రజల జీవితాలలో వెలుగు రావాలని అనంతపురం, ఆదిలాబాద్, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాల లో వెలుగు పథకాన్ని ప్రారంభించి చెక్ డ్యాములు నిర్మించి, పాటు కాలువలు సరి చేస్తూ, చెరువులలో పూడిక తీసి రైతుల పంట పొలాలకు తరలించి రైతుల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని అన్నారు. కెసిఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత పవిత్రమైన పట్టు పరిశ్రమను తీసేసి హార్టికల్చర్ లో కలిపి పట్టుపరిశ్రమని పండపెట్టారని మండిపడ్డారు. గ్రామాలలో 10% లేని భూస్వాములకు 54 శాతం భూమి ఉందని, 90% మెజారిటీ గల ప్రజలకు కేవలం 3.8% భూమి మాత్రమే కలదని ఎమ్మెస్ స్వామినాథన్ కమిషన్ ఆనాడే చెప్పిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు సుధాకర్ నాయుడు, కిషన్ నాయక్, పట్టణ అధ్యక్షుడు కాగితాల లక్ష్మయ్య, శ్రీనివాసరెడ్డి, చిట్యాల బాలరాజు, షాకీర్ హుస్సేన్, బండారి యాదయ్య, హోటల్ బలరాం, డి బాలరాజు, కొత్త గొల్ల శంకర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## 99 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి మిగిలిన ప్రక్రియను వేగవంతం చేయాలి

### - కలెక్టర్ కుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్ జూలై 07 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (Special Intensive Revision -- SIR) ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 99 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. మిగిలిన ప్రక్రియను కూడా అత్యంత ప్రాధాన్యతతో, వేగవంతంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు (EROs), సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు (AEROs)తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహబూబ్ నగర్ జిల్లా నుండి కలెక్టర్ ఖుష్బూ గుప్తా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం తన ఛాంబర్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ERO\T, AEROలతో ఇతర ఎలక్షన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే జిల్లాలో 99 శాతం ఎన్యూమరేషన్ ఫారం డిస్ట్రిబ్యూషన్ పూర్తి అయిందని, మిగిలిన వాటినికూడ బీఎల్‌వోలు క్షేత్ర స్థాయిలో ఇంటింటికి తిరిగి ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలు త్వరితగతిన పంపిణీ చేయాలని, నిర్ణీత గడువులోగా పూర్తిగా నింపిన ఫారాలను అవసరమైన వివరాలతో సేకరించాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు తనకు అందిన ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి తప్పనిసరిగా దీూాకు సమర్పించాలని, తద్వారా తప్పులు లేని, ఓటరు జాబితా రూపొందించేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.ముఖ్యంగా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులు, కాలనీల్లో చెత్త సేకరణ వాహనాల ద్వారా ఎస్.ఐ.అర్ పై ప్రత్యేక అవగాహన ఆడియో సందేశాలను ప్రసారం చేయాలని సూచించారు.అలాగే రిసోర్స్ పర్సన్లు (RPs) మరియు వార్డ్ ఆఫీసర్లు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి బూత్ లెవల్ అధికారులకు (BLOs) సహకరించాలని, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీతో పాటు ఓటర్లకు ఫారాలు సక్రమంగా పూరించడంలో సహాయం చేయాలని ఆదేశించారు. ప్రతి మున్సిపల్ కార్యాలయం, జిల్లా పరిషత్ కార్యాలయం, వార్డు కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేసి, బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్‌వైజర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు కలిసి ఓటర్లకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు.
పద్మావతి కాలనీ, శ్రీనివాస్ కాలనీ ప్రాంతాల నుంచి కొన్ని ఫిర్యాదులు అందుతున్నాయని కలెక్టర్ తెలిపారు. కొందరు బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లకుండా వాట్సాప్ గ్రూపులు, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ద్వారా ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలను ఏమాత్రం సహించబోమని, సంబంధిత బీఎల్‌వోలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రతి బీఎల్‌వో తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి ఫారాలను పంపిణీ చేయడంతో పాటు, ఓటర్లు పూరించిన ఫారాలను స్వయంగా సేకరించాలని స్పష్టం చేశారు.
మున్సిపల్ కమిషనర్లు ఆకస్మిక క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి, ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ఎలాంటి పొరపాట్లు లేకుండా సజావుగా సాగేందుకు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.రాబోయే ఒక నెల రోజుల పాటు ఎస్ఐఆర్ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, సంబంధిత అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేసి నిర్ణీత గడువులోగా ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు.
అంతకుముందు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ సవరణ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 25వ తేదీ నుండి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని, ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ తుది దశకు చేరుకుందని తెలిపారు. పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను ఓటర్లు వివరాలు నమోదు చేసిన తదుపరి బిఎల్ఓ యాప్ లో డిజిటైజేషన్ చేపట్టాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలలో ఓటర్ల వివరాల నమోదుకు వాలంటీర్లను ఉపయోగించుకొని ఓటర్లకు సహాయ పడాలని తెలిపారు. డిజిటైజేషన్ ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జూలై 20 వ తేదీ నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. డిజిటైజేషన్ పూర్తయిన తర్వాత పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాలని, ఒక పోలింగ్ కేంద్రంలో 1200 ఓటర్లకు మించి ఉండకుండా రేషనలైజేషన్ చేయాలని తెలిపారు. ఓటర్లు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా తప్పుడు సమాచారం సమర్పిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. డిజిటైజేషన్ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులకు సూపర్వైజర్లు, వాలంటీర్లు సహాయం అందించాలని తెలిపారు.
జిల్లా కలెక్టర్ ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1950లోని సెక్షన్లు 17, 18, మరియు 31లను కఠినంగా అమలు చేయాలని ఇది నిర్దేశిస్తుంది , ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాలలో లేదా ఏదేని నియోజకవర్గంలో ఒకసారి కంటే ఎక్కువసార్లు నమోదు చేసుకోవడాన్ని ఇది నిషేధిస్తుంది అని తెలిపారు
ఓటర్ల జాబితా సవరణ సమయంలో తప్పుడు వాంగ్మూలాలు లేదా ప్రకటనలు సమర్పించడం వంటి ఉల్లంఘనలకు ఒక సంవత్సరం వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించబడతాయి.
24.07.2026 లోగా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించిన వారి పేర్లు జూలై 31న విడుదలయ్యే ముసాయిదా ఓటరు జాబితాలో నమోదు అవుతాయని తెలిపారు. ఓటరు వివరాలతో ఫారాలు ఇవ్వని వారి పేర్లు ముసాయిదా ఓటర్ల జాబితాలో నమోదు కావు అని, ఈ విషయాని ప్రజలకు తెలపాలని అన్నారు. అర్హతకలిగిన ప్రతియొక్క ఓటర్ వివరాలను నమోదు అయ్యేటట్టు అధికారులు ప్రజలకు అవగాహన కలిగించాలని అన్నారు.
జిల్లా కలెక్టర్లు, ERO\T, AERO,BLO మరియు దీూా సూపర్వైజర్స్ ప్రత్యేక సవరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ ఓటరు జాబితా సవరణను పారదర్శకంగా, ఎలాంటి వ్యత్యాసాలకు తావులేకుండా నిర్వహించాలని ఆయన ఆదేశించారు.
వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ERO\T, AEROలతో సమీక్ష నిర్వహించారు. బీఎల్‌వోలు క్షేత్ర స్థాయిలో ఇంటింటికి తిరిగి ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలు త్వరితగతిన పంపిణీ చేయాలని, నిర్ణీత గడువులోగా పూర్తిగా నింపిన ఫారాలను అవసరమైన వివరాలతో సేకరించి వాటిని ఆన్లైన్ డిజిటైజ్డ్ ఏ రోజు కు ఆ రోజు చేయాలని అధికారులను ఆదేశించారు.
అర్హత కలిగిన ప్రతి ఓటరు తనకు అందిన ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి తప్పనిసరిగా దీూాకు సమర్పించాలని, తద్వారా తప్పులు లేని, ఓటరు జాబితా రూపొందించేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, ఆర్.డి.ఓ నవీన్, మహబూబ్ అర్బన్ తహసీల్దార్ ఘన్సిరాం నాయక్, ఎలక్షన్ డి.టి జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

# స్పోకెన్ ఇంగ్లీష్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



**ఖమ్మం (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లీష్ నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే ఉద్యోగ ,ఉపాధి అవకాశాలు సొంతం అవుతాయని ఇంటర్నేషనల్ స్పోకెన్ ఇంగ్లీష్ నిపుణులు ఎస్ ఎం అరుణ్ తెలిపారు. స్థానిక దూరదర్శన్ కేంద్రం వద్ద ఉన్న కాలేజ్ బాలికల వసతి గృహంలో ఆదివారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు తమ కోర్సును పూర్తి చేసుకున్న తర్వాత స్పోకెన్ ఇంగ్లీష్ నైపుణ్యాలు ఉన్నవారికే ప్రథమ ప్రాధాన్యతగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు ఆంగ్ల పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థినిలకు ఏరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హ్యాండ్ వాష్, సోప్ కిట్లను బహుకరించారు. ఏరా ఫౌండేషన్ చైర్మన్ ఫర్హా పరిశుభ్రత అంశాల గురించి ప్రచారంలో భాగంగా విద్యార్థినీలకు ఈ కిట్ లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల నిపుణులు ఎస్ ఎం అరుణ్ , వసతి గృహం హెచ్ డబ్ల్యు ఓ కోమలి , హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు. ఎస్ ఎం అరుణ్ ను హెచ్ డబ్ల్యు ఓ కోమలి, విద్యార్థినీలు ఘనంగా సత్కరించారు.

# విద్యారంగంలో ఎన్నో సంస్కరణల



**నేలకొండపల్లి, జూలై 07 (జర్నలిస్ట్ ఫైల్) :**

విద్యా రంగంలో ఎన్నో మార్పుల కోసం అనేక సంస్కరణలు చేపట్టిన సృష్టికర్త డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీయం జిల్లా అధ్యక్షులు అనంతు ఉపేందర్ గౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్.శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి ని నిర్వహించారు. ఆయన చిత్ర పటం కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారతదేశ సమగ్రత కోసం, ఐక్యత కోసం తన ప్రాణాలను సైతం అర్పించిన గొప్ప దేశభక్తుడు అన్నారు. ఏక్ దేశ్ మే దో విధాన్ . దోప్రధాన్ ఔర్ దో నిషాన్ నహీ చలేంగే అని ఆయన గర్జించారన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన సేవలు మరవలేనివి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, భువనాసి దుర్గారావు, మల్లెబోయిన గోవిందరావు, పురాణం దికవార్, కొండా హర్షవర్ధన్, సూరేపల్లి జ్ఞానరత్నం, షేక్ షర్ఫుద్దున్, సయ్యద్ మోహినుద్దీన్, గెల్లా చక్రపాణి, ఎలిగేటి గిరి, పుట్టా సత్యనారాయణ, పిట్టల సూరిబాబు, తేజావత్ నాగరాజు, కాళంగి వెంకటేశ్వర్లు, గెల్లా నాగసాయి, బానోత్ శ్రీనివాసరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# చింతూరు డివిజన్‌లో 108 అంగన్వాడీ పోస్టుల భర్తీకి ప్రకటన

**చింతూరు, జూలై 07 (జర్నలిస్ట్ ఫైల్) :**




చింతూరు ఐటీడీఏ పిఓ ఆదేశాల మేరకు, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్, చింతూరు డివిజన్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు.చింతూరు డివిజన్ పరిధిలో భర్తీ చేయనున్న పోస్టుల వివరాలు తెలిపారు.అంగన్వాడీ వర్కర్లు – 2 పోస్టులు, మినీ అంగన్వాడీ వర్కర్లు – 2 పోస్టులు, అంగన్వాడీ హెల్పర్లు – 104 పోస్టులుమొత్తం ఖాళీలు : 108 పోస్టులు ఉన్నాయని అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న విద్యార్హతలు, వయోపరిమితి, స్థానికత, అవసరమైన ధ్రువపత్రాలు, ఎంపిక విధానం, దరఖాస్తు గడువును జాగ్రత్తగా పరిశీలించి, నిర్ణీత గడువులోపు సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.నోటిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలు సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాలు, సీడీపీఓ కార్యాలయాలు, సంబంధిత అంగన్వాడీ కేంద్రాల నోటీస్ బోర్డులలో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

# కాలనీలు, మురికివాడల్లో తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి: బండి రమేష్



**కూకట్పల్లి (జర్నలిస్ట్ ఫైల్) :** కూకట్పల్లి నియోజకవర్గం లోని కాలనీలతో పాటు మురికివాడల్లో సైతం తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ అధికారులకు సూచించారు. ఈ మేరకు ఆయన స్థానిక నాయకులతో కలిసి సోమవారం కేపీహెచ్‌బీ వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) హరి శంకర్‌ను కలిశారు.వాటర్ వర్క్స్ పరిధిలోకి వచ్చే సఫ్దర్ నగర్, దీన్ దయాళ్ నగర్, మోతి నగర్, 15వ ఫేజ్‌లలో కొత్తగా డ్రైనేజీ లైన్ల నిర్మాణం చేపట్టాలని, అలాగే మోతి నగర్‌లో వాటర్ సంపు నిర్మించాలని బండి రమేష్ జీఎంకు సూచించారు. అదేవిధంగా మురికివాడల్లో 20 వేల లీటర్ల ఉచిత తాగునీటిని అందించాలని కోరారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని, సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలతో సమన్వయం కొనసాగిస్తామని బండి రమేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డీజీఎంలు త్రినాధరావు, చంద్రశేఖర్, లక్ష్మయ్య, తూము వేణు, సతీష్ రెడ్డి, కృష్ణ రాజ్ పుత్, రాజేష్, మైఖేల్, ఫణి కుమార్, రజిత, వనజ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యం

**- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**



**ఖమ్మం,జూలై 07(జర్నలిస్ట్ ఫైల్):** ఖమ్మం వ్యాప్తంగా పారిశుద్ధ్య నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టి లో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే సమగ్ర ప్రణాళిక రూపొందించి పారిశుద్ధ్య సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని డి మాండ్ చేశారువర్షాకాలం దృష్ట్యా ఖమ్మాన్ని పరిశుభ్రంగా ఆరోగ్యవంతంగా ఉంచేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సూచించారు. పారిశు ద్ధ్యం లోపించడం అపరిశుభ్రత కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రతిచోటా చెత్త పేరుకుపోవడం, మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని పువ్వాడ ఆందోళన వ్యక్తంచేశారు.

# మణుగూరులో నూతన పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్





**భద్రాద్రి కొత్తగూడెం, (జర్నలిస్ట్ ఫైల్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శాంతిభద్రతలను మరింత పటిష్టం చేయడంతో పాటు ప్రజలకు ఆధునిక సౌకర్యాలతో కూడిన మెరుగైన పోలీసు సేవలు అందించాలనే లక్ష్యంతో మణుగూరులో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రోహిత్ రాజు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, పోలీసు శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీటీవీ మానిటరింగ్ సెల్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, సింగరేణి సంస్థ సహకారంతో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణం పూర్తయిందని, ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన పోలీసు సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు, హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో నేరాల నియంత్రణతో పాటు అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతూ సమర్థవంతంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించగలుగుతున్నామని డీజీపీ తెలిపారు. నేరాల నియంత్రణ, దర్యాప్తు, సీసీటీవీ నిఘా, సైబర్ నేరాల విచారణ వంటి అంశాల్లో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందన్నారు.మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా సమాజాన్ని వినాశన దిశగా నడిపిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. భావితరాలను ఈ ప్రమాదం నుంచి కాపాడేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఇందులో భాగంగా ఈగల్ (EAGLE) వంటి ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసి, కింది స్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు సమన్వయంతో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్ రహదారి ప్రమాదాల నివారణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా చేసే ముఠాలను తీవ్రవాదుల మాదిరిగానే పరిగణిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ అంకిత్ నూతన పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీటీవీ మానిటరింగ్ సెల్‌ను ప్రారంభించి, పోలీస్ స్టేషన్‌లో కల్పించిన ఆధునిక మౌలిక సదుపాయాలను పరిశీలించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు సత్వర, పారదర్శక పోలీసు సేవలందించడంలో జిల్లా యంత్రాంగం పోలీసు శాఖతో సమన్వయంగా పనిచేస్తోందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా నేరాల నియంత్రణతో పాటు ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు ఈ నూతన పోలీస్ స్టేషన్ దోహదపడుతుందని పేర్కొన్నారు.అనంతరం డీజీపీ, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో కలిసి పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ప్రజలకు స్నేహపూర్వక, పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పోలీసు సేవలు అందించాలని పోలీసు అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీసు శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సింగరేణి సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్‌లో ఆధునిక వ్యర్థాల నిర్వహణపై ప్రశంసలు

**ఖమ్మం (జర్నలిస్ట్ ఫైల్) :** సోమవారం రాయికల్ మున్సిపాలిటీ బృందం తొలుత ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ డంపింగ్ యార్డ్‌ను సందర్శించి అక్కడ అమలు చేస్తున్న ఘన వ్యర్థాల నిర్వహణ విధానాలను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. డీఆర్‌సీసీ కేంద్రంలో పొడి వ్యర్థాల సేకరణ, వర్గీకరణ, రీసైక్లింగ్‌కు పంపించే విధానాన్ని అధికారులు వివరించారు. అలాగే తడి వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేసి సేంద్రీయ ఎరువుగా తయారు చేస్తున్న విధానాన్ని బృందం ఆసక్తిగా పరిశీలించింది.డంపింగ్ యార్డ్‌లో కొనసాగుతున్న బయో–మైనింగ్ ప్రక్రియను పరిశీలించిన బృందం, సుమారు 2 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల లెగసీ వ్యర్థాలను తొలగించి 22 ఎకరాల భూమిని తిరిగి వినియోగంలోకి తీసుకురావడం పట్ల అభినందనలు తెలిపింది. రీక్లెయిమ్ చేసిన భూమిలో మినీ ఫారెస్ట్‌ను అభివృద్ధి చేయడం, బయో–సాయిల్‌ను నగరంలోని పార్కులు, డివైడర్లలో వినియోగించడం, ఆర్ డి ఎఫ్ ను సిమెంట్ పరిశ్రమలకు తరలించడం వంటి చర్యలను ప్రశంసించింది. ఇలాంటి శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ విధానాలను తమ మున్సిపాలిటీలో కూడా అమలు చేసేందుకు కృషి చేస్తామని చైర్మన్ కట్కం రవి తెలిపారు.



### ఎఫ్ ఎస్ టి పి కేంద్రం సందర్శన

అనంతరం బృందం ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ను సందర్శించింది. నగరంలోని సెప్టిక్ ట్యాంకుల నుంచి సేకరించే ఫీకల్ స్లడ్జ్‌ను శాస్త్రీయ పద్ధతిలో శుద్ధి చేసి పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా నిర్వహిస్తున్న విధానాన్ని అధికారులు వివరించారు. ప్లాంట్‌లో వ్యర్థ జలాల శుద్ధి, ఘన మరియు ద్రవ వ్యర్థాల వేరు చేయడం, శుద్ధి అనంతరం పర్యావరణ ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహిస్తున్న ప్రక్రియలను బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. పారిశుధ్య నిర్వహణలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అనుసరిస్తున్న ఆధునిక విధానాలు ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని బృందం అభిప్రాయపడింది.

### ఎన్టీఆర్ పార్క్ అభివృద్ధికి ప్రశంసలు

పర్యటనలో భాగంగా బృందం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 54వ డివిజన్‌లో అభివృద్ధి చేసిన ఎన్టీఆర్ పార్క్‌ను సందర్శించింది. పార్కులో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, చిన్నారుల ఆట స్థలాలు, సుందరమైన ల్యాండ్‌స్కేపింగ్, పచ్చదనం, పరిశుభ్రమైన నిర్వహణ, సందర్శకులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి బృందం అభినందనలు తెలిపింది. ప్రజలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేలా పార్కును అభివృద్ధి చేసిన విధానం తమను ఎంతగానో ఆకట్టుకుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా రాయికల్ మున్సిపాలిటీ చైర్మన్ కట్కం రవి మాట్లాడుతూ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక వసతులతో పార్కులను అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. ఇదే తరహాలో రాయికల్ మున్సిపాలిటీలో కూడా పచ్చదనానికి పెద్దపీట వేస్తూ వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, చిన్నారుల ఆట స్థలాలతో కూడిన మోడల్ పార్కులను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు.

# బీసీ కులాలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి

**హైదరాబాద్, జూలై 07 (జర్నలిస్ట్ ఫైల్) :**

హైదరాబాదులోని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్నాటి యాదయ్య తో కలిసి పాత్రికేయులతో మాట్లాడారు. బీసీ కులాలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో డిలిమిటేషన్ బిల్లు మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటు లో ప్రవేశ పెట్టడానికి తిరిగి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్టుగా వార్తలు వస్తున్నాయని ఆ బిల్లుతోపాటు పార్లమెంటులో, అసెంబ్లీలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో బీసీ ఎమ్మెల్యేలు బీసీ ఎంపీలను ఎన్నుకునే విధంగా రాజకీయ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని స్వాతంత్రం వచ్చి సుమారు 8 దశాబ్దాలు కావస్తున్నా ఇంతవరకు బీసీలకు రాజకీయ రిజర్వేషన్ ఏర్పాటు చేయలేదని, అలా చేస్తే దేశంలో సామాజిక న్యాయం అందరికీ అందుతుందని దేశవ్యాప్తంగా ఆరువేల కులాలు ఉండగా ఇప్పుడు దాకా 5900 కులాలు పార్లమెంట్ గడప తొక్కలేదని, స్వాతంత్ర ఫలాలు కేవలం కొద్ది మందికి మాత్రమే అందుతున్నాయని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టి ఆయా కులాల దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్లు అలాగే బడ్జెట్లో నిధుల కేటాయింపులు జరపాలని వారు విజ్ఞప్తి చేశారు.




# పెండింగ్ ఫీజు తిరిగి చెల్లింపులు, ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలి - ఎస్ఎఫ్ఐ

**వికారాబాద్, జూలై 07 (జర్నలిస్ట్ ఫైల్) :**

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు తిరిగి చెల్లింపులు, ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేసి విద్యారంగ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ వికారాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులతో కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం వాటి పరిష్కారంలో విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలను భారీగా కుదించే ప్రయత్నాలను విరమించుకోవాలని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని ఆరోపించారు. ఆ విధానాన్ని రద్దు చేసి గతంలో మాదిరిగా మహిళా సంఘాల ద్వారానే భోజన నిర్వహణ చేపట్టాలని కోరారు.రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, మండల విద్యాధికారులు, జిల్లా విద్యాధికారులు, అధ్యాపకుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టి ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కోరారు. విద్యాసంస్థల్లోనే పుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫారాలు విక్రయిస్తూ వ్యాపారం చేయడాన్ని ప్రభుత్వం అడ్డుకోవాలని అన్నారు.పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు తిరిగి చెల్లింపు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వం జారీ చేసిన 7, 8, 9 ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు.అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ వసతి గృహాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని, వికారాబాద్ జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తేజ, జిల్లా కమిటీ సభ్యులు రాకేష్, పవన్, దీపక్, అనిల్, సంజు, ముత్యం, సాయిరాం, సాయితేజ, పాండు తదితర విద్యార్థులు పాల్గొన్నారు.



# ఘనంగా భారత మాజీ ఉప ప్రధాని డా. బాబు జగ్జీవన్ రామ్ 40 వ వర్ధంతి వేడుకలు



**వైరా, జూలై 07 (జర్నలిస్ట్ ఫైల్) :**

వైరా మండల పార్టీ కాంగ్రెస్ కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధుడు సంఘసంస్కర్త, భారత ఉపప్రధాని డా. బాబు జగ్జీవనరామ్ 40వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1946లో, అతను జవహర్‌లాల్ నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వంలో అతి పిన్న వయస్కుడైన మంత్రిగా బాధ్యతలు చేపట్టాడు. భారతదేశపు మొట్టమొదటి క్యాబినెట్ కార్మిక మంత్రి, భారత రాజ్యాంగ పరిషత్ సభ్యుడు.అతను సామాజిక న్యాయం రాజ్యాంగంలో పొందుపరచబడిందని నిర్ధారించాడు. అతను భారత జాతీయ కాంగ్రెస్ సభ్యుడిగా నలభై సంవత్సరాలకు పైగా వివిధ శాఖల క్యాబినెట్ మంత్రిగా పనిచేశాడు. భారతదేశంలో హరిత విప్లవం, భారత వ్యవసాయాన్ని ఆధునీకరించడంలో అతను అందించిన సహకారం, కేంద్ర వ్యవసాయ మంత్రిగా తన రెండు పదవీకాలాల్లో 1974 కరువు సమయంలో, ఆహార సంక్షోభాన్ని నివారించటానికి ప్రత్యేకంగా అదనపు మంత్రిత్వ శాఖను నిర్వహించమని కోరినప్పుడు అంగీకారం తెలుపటం ఎప్పటికీ గుర్తుంచుకోవాల్సిన విషయం. అతని సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళి కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్, సర్పంచుల సంఘం అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ నాయకులు వీరంశెట్టి సీతారాములు, జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ పణితి శ్రీనివాస్ రావు, పువ్వాళ్ళ రాము, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మిట్టపల్లి నాగి, ధర్నా రాజశేఖర్, పెద్దపోలు లక్ష్మయ్య, కర్నాటి హనుమంతరావు, చెరుకూరి కిరణ్, ఒకటో వార్డు కౌన్సిలర్ మోర్ శ్రీకాంత్, కన్నెగటి నగేష్, జాలాది రామకృష్ణ, తెళ్ళూరి వీరయ్య, ఆది ఆనందరావు, ఏదునూరి కోటయ్య, బత్తుల శ్రీను, బండారు నాగరాజు, కన్నెగటి హుస్సేన్, బొడ్డు కృష్ణ, నారపోగు రవి, కంభపాటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# బూతు ఏజెంట్లు సర్ ఫామ్ తప్పులు లేకుండా నింపండి



**వైరా, జూలై 07 (జర్నలిస్ట్ ఫైల్) :**

వైరా మున్సిపాలిటీ పరిధిలో ని 12వ వార్డులో సర్ కార్యక్రమాన్ని పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు పరిశీలించారు. ఈ సందర్భంగా కట్ల రంగారావు మాట్లాడుతూ సర్ కార్యక్రమం లో ఫామ్ నింపే విధానాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవాలి ప్రతి కార్యకర్త సరిపట్ల జాగ్రత్త ఉండాలి. ఎక్కడా కూడా ఓటర్ల జాబితాలో ఓట్లు పోకుండా ఉండే విధంగా చూడాలి అని అన్నారు. ప్రతి ఒక్కరూ బూత్ ఏజెంట్లు జాగ్రత్తగా ఉండి ఓటర్ల తో ఫామ్ నింపించాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి నాగి,కట్ల నాగరాజు రేచర్ల నాగేశ్వరావు ,రేచర్ల విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు

# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుధాకర్

**ఏన్కూరు, (జర్నలిస్ట్ ఫైల్) :**



తెలంగాణ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మారావుపేటకు చెందిన ఏర్పుల సుధాకర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు పులి లక్ష్మయ్య నుంచి సోమవారం ఉత్తర్వులు అందాయి. ఆయన ఆరికాయలపాడు పశువైద్యశాలలో సహాయకుడిగా పనిచేస్తున్నారు. పశువైద్యంలో ఇరవై ఏళ్లుగా విశిష్ట సేవలందించడంతోపాటు సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొంటూ అనేక అవార్డులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా పోరాడతానని అన్నారు.

## జిల్లా పరిషత్‌లో 26 మందికి పదోన్నతులు.. 13 మందికి కారుణ్య నియామకాలు



○ **నియామక ఉత్తర్వులు అందజేసిన జడ్పీ చైర్‌పర్సన్**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లా ప్రజా పరిషత్‌లో పరిపాలనా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ఉద్యోగుల సేవలను గుర్తించి ప్రోత్సహించే లక్ష్యంతో 26 మంది ఉద్యోగులకు పదోన్నతులు, 13 మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా నియామక, పదోన్నతి ఉత్తర్వులను అభ్యర్థులకు అందజేశారు. ఈ మేరకు ముఖ్య కార్యనిర్వాహణాధికారి వి. జ్యోతిబసు ఉత్తర్వులు జారీ చేశారు.

పదోన్నతులలో భాగంగా ఎనిమిది మంది సీనియర్ అసిస్టెంట్లు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లుగా, 12 మంది జూనియర్ అసిస్టెంట్లు సీనియర్ అసిస్టెంట్లుగా, ఆరుగురు ఆఫీస్ సబార్డినేట్లు రికార్డు అసిస్టెంట్లుగా పదోన్నతి పొందారు. అలాగే కారుణ్య నియామకాల కింద 13 మందికి ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల్లో నియామకాలు కల్పించారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ అర్హత కలిగిన వారికి పారదర్శకంగా పదోన్నతులు, కారుణ్య నియామకాలు కల్పించడం సంస్థ లక్ష్యమని తెలిపారు. ముఖ్య కార్యనిర్వాహణాధికారి వి. జ్యోతిబసు మాట్లాడుతూ పదోన్నతులు పొందినవారు, కొత్తగా నియామకం పొందినవారు క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ ఏవోలు నిర్మల భారతి, శ్యాముల్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో నాయకత్వం, చట్టాలపై అవగాహన



○ **మంగళగిరి రూరల్ పోలీసుల 'సంకల్పం' కార్యక్రమం**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈబీఎస్‌వీ నిర్మల హైస్కూల్‌లో నిర్వహించిన లీడర్‌షిప్ ఎలక్షన్ కార్యక్రమంలో ఎన్నికైన విద్యార్థి నాయకులకు బాధ్యతలు, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణపై మంగళగిరి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చిరుమామిళ్ల వెంకట్ అవగాహన కల్పించారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలు, గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొంటే భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం ఉంటుందని వివరించారు. అలాగే బాలికలు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని, వేధింపులు లేదా అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

విద్యార్థులు, మహిళలు 'శక్తి' యాప్‌ను వినియోగించుకోవాలని, పాఠశాలలు, కళాశాలల్లో 'సంకల్పం' కార్యక్రమాల ద్వారా చట్టాలపై అవగాహన, సామాజిక బాధ్యత, మహిళల భద్రతపై చైతన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే షీ టీమ్స్ ద్వారా భద్రతా చర్యలను మరింత పటిష్టం చేసినట్లు వెల్లడించారు.

## రోడ్డుమీద ఇసుక ట్రాక్టర్ పార్క్ చేస్తే కఠిన చర్యలు: త్రీటౌన్ సిఐ సాంబశివరావు హెచ్చరిక



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) :** రోడ్డు ప్రమాదాలు జరిగి వ్యక్తులు మరణించటానికి కారణం ట్రాక్టర్లు రోడ్డు మీద నిలుపుదల చేయటం వలనే జరుగుతున్నాయని వాటిని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు త్రీ టౌన్ సిఐ సాంబశివరావు తెలియజేశారు. పట్నంలోని ముత్యంశెట్టి పాలెం కాబేలా వంతెన వద్ద జరుగుతున్న ప్రమాదాలు వలన స్పాట్ లోనే ప్రమాదానిగురైన వ్యక్తులు చనిపోతున్నారని తెలుసుకొని ఆ ప్రాంతాల్ని సిఐ పరిశీలించారు. ఈ సందర్భంగా వాటిని నియంత్రించే దిశగా త్రీటౌన్ సిఐ సాంబశివరావు ట్రాక్టర్లు యజమానులకు ఇకనుండి పట్నంలో ఎక్కడ కూడా ఇసుకలోడుతో కూడిన ట్రాక్టర్ రోడ్లపై నిలుపదల చేయవద్దని ట్రాక్టర్ యాజమానలను కోరారు. ఎవరైనా ప్రభుత్వ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుక లోడుతో కూడిన ట్రాక్టర్లను రోడ్డుపై నిలుపుదల చేస్తే తత్తపరమైన కేసుల రాయడం జరుగుతుందని త్రీ టౌన్ సిఐ సాంబశివరావు తెలియజేశారు.

# రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం : ఎమ్మెల్యే నసీర్

○ **యువత ఉద్యోగాలకు ఏపీ కేంద్రబిందువు**

○ **రూ.9 వేల కోట్లకుపైగా పెట్టుబడులకు ఆమోదం సంతోషకరం**

○ **ఇప్పటికే సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో పారిశ్రామిక ప్రగతి**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో యువతకు ఉజ్వల భవిష్యత్తు అందించే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో పారిశ్రామిక విప్లవానికి నాంది పలుకుతున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఏపీలో భారీగా పరిశ్రమల స్థాపనకు పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ఆమోదం తెలపడంపై ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. 9,076 కోట్ల రూపాయల పెట్టుబడులతో 11 ప్రాజెక్టులకు ఆమోదం లభించడం ద్వారా 10,531 ఉద్యోగ అవకాశాలు రానున్నాయని చెప్పారు. ఇది ఆంధ్రప్రదేశ్ లో యువతకు సువర్ణ అవకాశమని, మంచి స్కిల్స్ ఉన్న వారికి ఏపీని ఉద్యోగాలకు కేంద్రంగా మారుస్తున్నారని అన్నారు. మరో వైపు దక్షిణకొరియా పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేశ్ దిగ్గజ సంస్థలతో భేటీ అయ్యారని తెలిపారు. హ్యూందాయ్ మోబిస్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్, శాంసంగ్ వంటి కంపెనీతో చర్చలు నిర్వహిస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో చెప్పుల తయారీ వంటి కంపెనీలను సైతం రాష్ట్రం నుంచి తరిమికొట్టారని మండిపడ్డారు.

రాష్ట్రానికి పరిశ్రమలు రావాలంటేనే భయం కలిగేలా పాలన సాగించారన్నారు. దీంతో అనేక మంది యువత ఉద్యోగావకాశాలను కోల్పోయారని, వైసీపీది దుర్మార్గపు పాలన అని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వంలో రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, క్వాంటమ్ వ్యాలీ, గూగుల్ వంటి పెద్ద పెద్ద సంస్థలు తరలివచ్చాయని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో జాబ్ మేళా ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సృజనాత్మకతతో ఆలోచించాలని సూచించారు. అప్పుడే ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు.

# గుంటూరు జిల్లాలో 99.46 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. యం. సాయికాంత్ వర్మ తెలిపారు.

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 18,02,074 మంది ఓటర్లకు సంబంధించి ఇప్పటివరకు 17,92,379 ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయగా, ఇది 99.46 శాతం అని తెలిపారు. అలాగే 11,71,696 ఫారాలను డిజిటలైజేషన్ చేసి 65.02 శాతం పురోగతి సాధించినట్లు వెల్లడించారు.

నియోజకవర్గాల వారీగా తెనాలిలో అత్యధికంగా 99.85 శాతం ఫారాల పంపిణీ నమోదు కాగా, తాడికొండ నియోజకవర్గంలో 78.62 శాతం డిజిటలైజేషన్‌తో జిల్లా వ్యాప్తంగా తొలి స్థానంలో నిలిచింది. మంగళగిరి నియోజకవర్గంలో అత్యధికంగా 2,02,081 ఫారాలు డిజిటలైజేషన్ చేయడం విశేషం.

జిల్లా ఎన్నికల యంత్రాంగం ఆధ్వర్యంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటి సర్వే నిర్వహిస్తూ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీతో పాటు డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు.

అర్హులైన ఓటర్లు తమ వివరాలను పరిశీలించి, ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తిగా నింపి అవసరమైన పత్రాలతో కలిసి తమ పరిధిలోని బీఎల్‌వోలకు వీలైనంత త్వరగా అందజేసి ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ-2026 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఓటర్లు తమ ఎస్ఐఆర్ వివరాలను భారత ఎన్నికల సంఘం ఆన్‌లైన్ పోర్టల్‌లో పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఈ పోర్టల్ ద్వారా తమ వివరాలను ధృవీకరించుకోవడంతో పాటు ఎన్యుమరేషన్ ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని కూడా పొందవచ్చని సూచించారు.

# జూలై 31లోగా అవెన్యూ ప్లాంటేషన్ పూర్తి చేయాలి

○ **కమిషనర్ మయూర్ అశోక్**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగరాన్ని పచ్చదనంతో సుందరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ నెల 31వ తేదీలోగా నగరవ్యాప్తంగా అవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ ఇంజినీరింగ్, పార్కుల విభాగాల అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏడీహెచ్ శాంతి, ఏఈ నాసరయ్యతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్లాంటేషన్ పురోగతిపై చర్చించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, మొక్కల నాటడాన్ని కేవలం అధికారిక కార్యక్రమంగా కాకుండా నగర ప్రజల భాగస్వామ్యంతో హరిత ఉద్యమంగా చేపట్టాలని సూచించారు. స్థానిక నివాసితులు, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నగరంలోని విద్యాసంస్థలు, ప్రధాన వ్యాపార సముదాయాలు, ఆసుపత్రుల పరిసరాలు, ప్రధాన రహదారులను ప్రాధాన్యంగా తీసుకుని ముందస్తు ప్రణాళికతో 'పిన్ పాయింట్' విధానంలో మొక్కలు నాటాలని స్పష్టం చేశారు.

మొక్కల కోసం గోతులను ఇష్టానుసారంగా తవ్వకుండా డిగ్గింగ్ యంత్రాలను వినియోగిం చాలని సూచించిన కమిషనర్, మొక్కల నాటకంతో పాటు వాటి మనుగడపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రతి మొక్కకు ట్రీ గార్డులు ఏర్పాటు చేసి పశువులు లేదా ఇతర కారణాలతో మొక్కలు దెబ్బతినకుండా రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నగరాన్ని హరిత నగరంగా తీర్చిదిద్దడంలో జూలై 31 గడువు కీలకమని, ఇంజినీరింగ్, పార్కుల విభాగాలు పరస్పర సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

# పాత గుంటూరులో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

○ **ఏడుగురు అదుపులోకి..**

**రూ.29,120 నగదు, సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాల స్వాధీనం**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై గుంటూరు జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపుదాడి నిర్వహించి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల కోసం పాత గుంటూరు పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో మంగళదాస్ నగర్ రెండో లైన్‌లోని ఓ ఇంటిలో పేకాట నిర్వహిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్‌కు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసిన అనంతరం, వారి ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడి నిర్వహించారు.

దాడిలో పేకాట నిర్వహిస్తున్న నిర్వాహకుడితో పాటు పేకాట ఆడుతున్న మరో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 29,120 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను, స్వాధీనం చేసుకున్న వస్తువులను చట్టపరమైన చర్యల కోసం పాత గుంటూరు పోలీస్ స్టేషన్ అధికారులకు అప్పగించారు.

పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112కు సమాచారం అందించాలని సూచించారు.

## మహిళల సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన మహిళా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి మహిళల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. వ్యక్తిగత సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఇబ్బందులు, ఉపాధి అవకాశాలు, మౌలిక వసతులు, పెన్షన్లు తదితర అంశాలపై మహిళలు తమ సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

ఈ సందర్భంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని దండమూడి శ్రేయకు తెలుగు మహిళా అధ్యక్షురాలు ముత్తినేని శివలీల సహకారంతో ఏడాదికి అవసరమైన విద్యా పుస్తకాలను ఎమ్మెల్యే అందజేశారు. అలాగే నల్లచెరువు ప్రాంత మహిళలు కుట్టు మిషన్ శిక్షణ పొందినప్పటికీ ఉపాధి అవకాశాలు కల్పించాలని చేసిన విజ్ఞప్తిపై స్పందించిన గళ్ళా మాధవి, మహిళల ఆర్థిక సాధికారతకు అవసరమైన అవకాశాలను పరిశీలించి సంబంధిత సంస్థలతో చర్చించి సహాయం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి : దళిత క్రైస్తవుల డిమాండ్



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) :** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని దళిత క్రైస్తవ నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను పలువురు డిమాండ్ చేశారు. పట్టణంలోని స్థానిక ఎన్జీవో హోం కళ్యాణ మండపము నందు దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరుతూ డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ సేవా ట్రస్ట్ మరియు జై భీమ్ ఫెడరేషన్ మరియు ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ ఐక్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దళిత క్రైస్తవ నాయకులు మాట్లాడుతూ ఒక వ్యక్తికి జనముతో కులం అనేది వస్తుంది కానీ మతం అనేది రాదని ఈ విషయంపై కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ఆలోచన చేయాలని వారు కోరారు. మతం అనేది ఒక వ్యక్తికి సంబంధించిన ఆధ్యాత్మిక భావాలను పెంపొందించేదే కానీ అది కులం కాదని వారు గుర్తు చేశారు. మతం ద్వారా మనిషి తన ప్రవర్తనలో మంచి మార్పు కలిగి సమాజంలో ఉన్నత స్థానానికి వెళ్లడానికి దోహదపడుతుందే తప్ప కులానికి మతానికి సంబంధం లేదనే విషయాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని వారు కోరారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదాను కల్పించాలని కోరుతూ వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. దళిత క్రైస్తవులకు శ్రీ హోదా కోరుతూ భవిష్యత్తులో బహిరంగ సభను నిర్వహించేందుకు సన్నహాలు చేస్తున్నట్లు ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించినట్లు దళిత క్రైస్తవ నాయకులు పలువురు తెలియజేశారు. సమావేశంలో తెనాలి పట్టణంలో ఉన్నటువంటి క్రిస్టియన్ మిషనరీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ వెరిఫికేషన్ (సర్)కార్యక్రమం




○ **ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాలతో కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి**

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు టీడీపీ మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి సూచనలతో బ్రహ్మంగారిమఠం మండలంలోని రేకలకుంట పంచాయతీ లోని డి. అగ్రహారం రేకలకుంట. కొత్తపల్లె, లక్ష్మి బాలాజీనగర్, బాగాదుపల్లె బూతులనందు నిర్వహించిన సర్ ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమంలో టీడీపీ ఉపాధ్యక్షులు కనాల మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను పరిశీలిస్తూ ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదైందో లేదో పరిశీలించారు. ఈ సందర్భంగా కానాల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో ఏవైనా తప్పులు లేదా పేర్లు లేకపోతే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేసి సరిచేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని ప్రతి ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ముందస్తుగా వెరిఫికేషన్ పూర్తి చేసుకోవడం అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి రామచంద్రారెడ్డి ఏపీఓ హరికృష్ణ రేకలకుంట 2 సచివాలయం సిబ్బంది, డి. అగ్రహారం బూత్ ఇన్చార్జ్ తోకల రామచంద్ర,బీఎల్‌ఏలు పెరుగు నాగేంద్ర, గుజ్జు రామాంజనేయులు,పుటాల శివ, చంద్ర ఓబుళనాయుడు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఓటర్లకు అవగాహన కల్పించారు.

# ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయం ప్రపంచానికే ఆదర్శం

○ **కెన్యా ప్రతినిధుల ప్రశంసల జల్లు**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ఆంధ్రప్రదేశ్ ప్రజా బాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ప్రకృతి వ్యవసాయ నమూనాలు అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటున్నాయి. ఈ అద్భుత సాగు పద్ధతులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు కెన్యా దేశానికి చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందం మంగళవారం గుంటూరు జిల్లా కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం గ్రామాన్ని, అలాగే అత్తోట భూమి భారతి లోని దేశీయ విత్తన సంరక్షణ కేంద్రాన్ని సందర్శించింది. ఈ బృందంలో సీడ్ సేవర్ నెట్‌వర్క్ కోఆర్డినేటర్ వంజామా న్జొరోగే డేనియల్, స్లో ఫుడ్ కెన్యా అధినేత జాన్ కరియుకి మ్వాంగి, గ్లోబల్ ఫీల్డ్ నెట్‌వర్క్ ప్రతినిధి ఒడ్డా ఫ్రైడే ఒచోమో, సీడ్ సేవర్ నెట్‌వర్క్ సభ్యురాలు జిప్పోరా న్యాంబురా కురియాతో పాటు న్యూయార్క్ యూనివర్సిటీ అబుదాబికి చెందిన ఇంటర్న్ ప్రసిద్ధ సప్కోటా పాల్గొన్నారు.

ఈ పర్యటనలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి మరియు కొల్లిపర మండలం ప్రత్యేక అధికారి పాల్గొని, జిల్లాలో జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను ప్రతినిధులకు సవివరంగా వివరించారు.

పర్యటనలో భాగంగా ప్రతినిధులు తొలుత స్థానిక రైతు శ్రీ డి. భీమరాజుకు చెందిన ఏ .టి.యం (Any Time Money) మోడల్ క్షేత్రాన్ని పరిశీలించారు. ఒకే పొలంలో వంకాయ, మిరప, టమాటా, కాకర, మామిడి సహా 20 పైగా వివిధ రకాల పంటలతో సాగు చేస్తున్న జీవ వైవిధ్య వ్యవస్థను, అక్కడ సహజంగా వృద్ధి చెందిన మిత్ర కీటకాలు, సూక్ష్మజీవుల చురుకైన పాత్రను చూసి వారు అబ్బురపడ్డారు. అనంతరం ఎటువంటి రసాయన పురుగుమందులు లేకుండా పెంచిన ఏ-గ్రేడ్ అరటి మోడల్ క్షేత్రాన్ని సందర్శించారు. అక్కడ ప్రధాన పంటలో ఎర పంటలుగా సాగు చేసిన బంతి, ఆముదం వంటి పంటల ద్వారా హానికర కీటకాలను గుర్తించి, సహజ కీటక నియంత్రణ ఎలా సాధిస్తున్నారో రైతులు వివరించగా ప్రతినిధులు ఆసక్తిగా గమనించారు. ఆ పక్కనే ఉన్న రసాయన వ్యవసాయ క్షేత్రంతో పోల్చి చూసినప్పుడు ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో భూమిపై ఉష్ణోగ్రత తక్కువగా ఉండటం, నేలలో తేమ శాతం ఎక్కువగా ఉండి, నేల ఎంతో మెత్తగా, జీవసారంతో నిండి ఉండటాన్ని గమనించి, ప్రకృతి సాగు నేల ఆరోగ్యాన్ని ఎంతగా మెరుగుపరుస్తుందో ప్రత్యక్షంగా లెక్కింపజేశారు.

అనంతరం ఈ అంతర్జాతీయ బృందం స్థానిక 'హెప్పి' స్వయం సహాయక సంఘం మహిళా సభ్యులతో ముఖాముఖి సమావేశమైంది. గ్రామస్థాయిలో మహిళలు ప్రకృతి వ్యవసాయాన్ని ఎలా నడిపిస్తున్నారు, ఇందుకోసం పొందుతున్న రుణాలు, తక్కువ పెట్టుబడితో సాధిస్తున్న కుటుంబ పోషణ మరియు రైతుల జీవనోపాధిలో వచ్చిన విప్లవాత్మక మార్పులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా SHG మహిళలు తమ అనుభవాలను పంచుకుంటూ, ప్రకృతి వ్యవసాయం ద్వారా అటు నేల ఆరోగ్యం, ఇటు కుటుంబ సభ్యుల ఆరోగ్యం మెరుగవ్వడమే కాకుండా ఆదాయం కూడా పెరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన అధికారి శిరీష, స్థానిక ప్రకృతి వ్యవసాయ రైతులు, సిబ్బంది పాల్గొన్నారు. పర్యటన ముగింపులో కెన్యా ప్రతినిధులు మాట్లాడుతూ... గుంటూరు జిల్లాలో సాగుతున్న జీవ వైవిధ్య ఆధారిత సాగు, సహజ కీటక నియంత్రణ పద్ధతులు, నేల ఆరోగ్య పరిరక్షణ మరియు మహిళల క్రియాశీలక భాగస్వామ్యం అద్భుతమని కొనియాడారు. ప్రస్తుతం ప్రపంచాన్ని వేధిస్తున్న వాతావరణ మార్పులను తట్టుకుని, సుస్థిరమైన వ్యవసాయాన్ని సాధించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ నమూనా ప్రపంచ దేశాలకు ఒక దిక్సూచిలా నిలుస్తుందని కెన్యా బృందం ముక్తకంఠంతో ప్రశంసించింది. .

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## 9న బనగానపల్లెకు సీఎం చంద్రబాబు

○ మీ భూమి- మీహక్కు కార్యక్రమానికి హాజరుకానున్న సీఎం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మీ భూమి – మీహక్కు కార్యక్రమంలో భాగంగా పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 9 తేదీన నంద్యాల జిల్లాలో పర్యటించనున్నారు. రీ సర్వే ప్రక్రియ పూర్తైన గ్రామాల్లోని రైతులు, భూ యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ చేసేందుకు గానూ ముఖ్యమంత్రి బనగానపల్లె నియోజకవర్గంలో పర్యటించనున్నారు. జూలై 9 తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేసే పట్టాదారు పాస్ పుస్తకాలతో కలిపి ఇప్పటి వరకూ ప్రభుత్వం 29 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేసినట్టు అవుతుంది. ఇప్పటివరకు 6,887 గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ పూర్తి చేసి 29.04 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రభుత్వం ముద్రించి పంపిణీ చేసింది. ఈ నెల రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 428 గ్రామాల్లో 2.48 లక్షల పట్టాదార్ పాస్ పుస్తకాల పరిశీలనను రెవెన్యూ శాఖ పూర్తి చేసింది.

నంద్యాల జిల్లాలో 8,412 ఖాతా పుస్తకాలు, బనగానపల్లె నియోజకవర్గంలోని 1,125 పాస్ పుస్తకాలను రెవెన్యూ శాఖ సిద్ధం చేసింది. వచ్చే ఏడాది మార్చి నాటికి మిగిలిన 9,929 గ్రామాల్లోనూ సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇంకా 64.53 లక్షల రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉంది. మీ భూమి మీ హక్కు సమావేశం అనంతరం బనగానపల్లె పార్టీ కార్యకర్తలతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు.

**సీఎం బనగానపల్లె షెడ్యూలు వివరాలివి..:** ఈ నెల 9 తేదీన ఉదయం 10 గంటలకు అమరావతి నుంచి బనగానపల్లెకు ముఖ్యమంత్రి బయల్దేరి వెళ్లనున్నారు. 11.20కి బనగానపల్లె చేరుకుని స్థానిక తహసిల్దారు కార్యాలయానికి వెళ్లనున్న ముఖ్యమంత్రి అక్కడ ప్రజలకు అందుతున్న సేవలను నేరుగా పరిశీలించనున్నారు. అలాగే పలువురు రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు మీ భూమి – మీ హక్కు పేరిట పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, బహిరంగ సభలో పాల్గొంటారు.

మధ్యాహ్నం 2.35 గంటలకు బనగానపల్లె నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. సాయంత్రం 4 గంటల తర్వాత ఆయన అమరావతికి బయల్దేరనున్నారు.

## టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా సాయం



○ వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చేతుల మీదుగా అందజేత

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమ విభాగం ద్వారా మంజూరైన రూ.5 లక్షల ప్రమాద బీమా ఆర్థిక సహాయాన్ని వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మంగళవారం లబ్ధిదారుల కుటుంబానికి అందజేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఆధ్వర్యంలో అమలవుతున్న కార్యకర్తల సంక్షేమ పథకం కింద ఈ ఆర్థిక సహాయం మంజూరైంది.

చుండూరు మండలం పెద్దగాదెలవర్రుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు తోకల కొండయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో, ప్రమాద బీమా పథకం కింద అవసరమైన పత్రాలను ఎమ్మెల్యే కార్యాలయం ద్వారా పార్టీ రాష్ట్ర కార్యాలయానికి పంపించారు. అనంతరం కార్యకర్తల సంక్షేమ విభాగం నిర్వహించిన ధ్రువీకరణ ప్రక్రియ పూర్తికావడంతో కొండయ్య భార్య తోకల మార్తమ్మకు రూ.5 లక్షల ఆర్థిక సాయం మంజూరైంది.

ఈ సందర్భంగా ఆర్థిక సహాయ పత్రాన్ని అందజేసిన నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసిన ప్రతి కార్యకర్త కుటుంబానికి అవసరమైన సమయంలో అండగా నిలవడం తెలుగుదేశం పార్టీ బాధ్యత అని అన్నారు. కార్యకర్తల సంక్షేమానికి పార్టీ ఎల్లప్పుడూ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, వారి కుటుంబాలకు అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తుందని పేర్కొన్నారు.

## ఆర్‌జేడీగా పదోన్నతి పొందిన సి.వి. రేణుకకు టీఎన్‌యూఎస్ ఘన సత్కారం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రకాశం జిల్లా జిల్లా విద్యాశాఖాధికారిగా సేవలందించి ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు (ఆర్‌జేడీ)గా పదోన్నతి పొందిన సి.వి. రేణుకను తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యూఎస్) నాయకులు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె విద్యారంగంలో మరింత ఉన్నత స్థానాలకు చేరుకుని విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు.

టీఎన్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రకాశం జిల్లాలో విద్యా పరిపాలనను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఉపాధ్యాయులు, విద్యార్థుల సంక్షేమానికి రేణుక చేసిన సేవలు ప్రశంసనీయమని అన్నారు. కార్యక్రమంలో చెరుకూరి పూర్ణచంద్రరావు, యనమల ఆంజనేయులు, ఆళ్ల సుబ్బయ్య, గోరంట్ల శ్రీనివాస్, బాచిన రామానాయుడు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## 12వ పీఆర్సీ ఏర్పాటు చేయాలి

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** 11వ వేతన సవరణ కాలం ముగిసి మూడేళ్లు గడిచినా 12వ వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేయకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగులు ఎదురుచూస్తున్నారని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాష తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో కనీసం మధ్యంతర భృతి (ఐఆర్) కూడా ప్రకటించకపోవడం ఉద్యోగుల్లో ఆందోళనకు కారణమైందన్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయినా పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయలేదని పేర్కొన్న ఆయన, ఈ నెల 10న జరిగే మంత్రివర్గ సమావేశంలో 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి, ఐఆర్ ప్రకటించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## ఆగస్టు 1 నుంచి 'స్వయం ఏపీ' బ్రాండ్ ప్రారంభం

○ మహిళా ఉత్పత్తులకు రాష్ట్రవ్యాప్త మార్కెట్

○ మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మహిళా స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీలు) తయారు చేసే నాణ్యమైన ఉత్పత్తులకు రాష్ట్రస్థాయి గుర్తింపు కల్పిస్తూ, స్థిరమైన మార్కెట్‌ను అందించేందుకు ప్రభుత్వం 'స్వయం ఏపీ' బ్రాండ్‌ను ఆగస్టు 1 నుంచి ప్రారంభించనున్నట్లు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రకటించారు.

విజయవాడలోని సెర్ప్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని 26 జిల్లాల సంప్రదాయాలను ప్రతిబింబించే 65 ప్రత్యేక ఉత్పత్తులను సెర్ప్ గుర్తించిందన్నారు. 587 మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో తయారవుతున్న ఈ ఉత్పత్తులను 'స్వయం ఏపీ' బ్రాండ్ పేరుతో మార్కెట్లోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

ఉత్పత్తుల నిల్వ, ఆర్డర్ల నిర్వహణ, వేగవంతమైన సరఫరా కోసం రెండు ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. విజయవాడలో బాపూజీ మ్యూజియం సమీపంలో, గొల్లపూడిలోని టీటీడీసీ ప్రాంగణంలో రెండు సిగ్నేచర్ స్టోర్లను ప్రారంభించనున్నట్లు చెప్పారు. మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా శిక్షణ అందిస్తున్నామని వివరించారు.

గ్రామీణ మహిళల ఉత్పత్తులకు స్థిరమైన మార్కెట్ కల్పించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచడంతో పాటు 'స్వయం ఏపీ' బ్రాండ్‌ను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటయ్యే పారిశ్రామిక యూనిట్ల పనితీరును ప్రతి నెల సామాజిక తనిఖీల ద్వారా సమీక్షిస్తామని తెలిపారు. అలాగే ఎస్‌హెచ్‌జీ మహిళల ఆధ్వర్యంలో ఆధునిక యాంత్రిక లాండ్రీ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఎస్‌హెచ్‌జీ మహిళా కుటుంబాల్లో వివాహ అవసరాల కోసం తక్కువ వడ్డీతో సులభంగా రుణాలు అందించే 'కళ్యాణ లక్ష్మి' పథకాన్ని స్త్రీనిధి ద్వారా ప్రారంభించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, ఎస్‌హెచ్‌జీ సభ్యులందరినీ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకాలలో శాతం వంద నమోదు చేసి జీవిత, ప్రమాద బీమా రక్షణ కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వెలుగు మార్ట్‌ల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, నష్టాల్లో ఉన్న లేదా సక్రమంగా పనిచేయని మార్ట్‌ల విషయంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సెర్ప్ కార్యదర్శి, సీఈఓ వాకాటి కరుణ, డైరెక్టర్లు, మార్కెటింగ్ సిబ్బంది, 'స్వయం ఏపీ' బ్రాండ్ కన్సల్టెంట్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మీ మార్ట్‌తో రేషన్ డీలర్లకు ఆర్థిక బలం : ఎమ్మెల్యే గళ్హా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 34వ డివిజన్ దేవాపురం రేషన్ షాప్ నెం.30లో "మీ మార్ట్ -- నీది, నాది, మనందరిదీ" కిరాణా విక్రయ కేంద్రాన్ని ఎమ్మెల్యే గళ్హా మాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమంతో పాటు రేషన్ డీలర్ల ఆర్థిక సాధికారతను లక్ష్యంగా పెట్టుకుని "మీ మార్ట్" కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఇప్పటివరకు రేషన్ దుకాణాల్లో ప్రభుత్వ సరుకుల పంపిణీ మాత్రమే జరిగేదని, ఇకపై అదే కేంద్రాల ద్వారా మార్కెట్ ధరల కంటే తక్కువకు నిత్యావసర వస్తువులు కూడా అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

కుప్పంలో పైలట్ ప్రాజెక్ట్‌గా విజయవంతమైన ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. రేషన్ డీలర్లకు పరిమిత ఆదాయంతో దుకాణాల నిర్వహణ కష్టంగా మారిన నేపథ్యంలో, "మీ మార్ట్" ద్వారా వారికి స్థిరమైన ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉచిత రవాణా సదుపాయం కల్పించడంతో పాటు డి-మార్ట్ వంటి పెద్ద రిటైల్ సంస్థల కంటే కూడా తక్కువ ధరలకు సరుకులు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. దేవాపురం రేషన్ షాప్ పరిధిలోని సుమారు 500 మంది కార్డుదారులు తమ ప్రాంతంలోనే తక్కువ ధరలకు నిత్యావసర సరుకులు కొనుగోలు చేసే అవకాశం కలుగుతుందని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఉన్న 90 రేషన్ షాపులన్నింటికీ ఈ కార్యక్రమాన్ని విస్తరించాలని ఆకాంక్షిస్తున్నట్లు గళ్హా మాధవి తెలిపారు. రేషన్ డీలర్లను పంపిణీదారులుగా కాకుండా వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడం, మహిళా డీలర్లకు ఉపాధి అవకాశాలు పెంచడం, ప్రజలకు ఇంటి సమీపంలోనే నాణ్యమైన సరుకులు అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఆహార సరఫరా శాఖ, రెవెన్యూ అధికారులు, రేషన్ డీలర్లు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు తక్షణమే పదోన్నతులు ఇవ్వాలి: ఏపీటీఎఫ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వం ఆయా శాఖలలో పదోన్నతులు కల్పించుకోవచ్చు అని జులై 13 వ తేదీ వరకు గడువు పెంచినందున అన్ని క్యాడర్ల ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయ రాజు, ఎస్ చిరంజీవి విద్యా శాఖను కోరారు గత సంవత్సరం బదిలీల చట్టం తయారుచేసి దానికనుగుణంగా రేషనలైజేషన్ , బదిలీలు , పదోన్నతులు చేపట్టిన విద్యాశాఖ ఈ సంవత్సరం ఆ ప్రక్రియను చేపట్టలేదు అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల విభజన జరుగుచున్న క్రమంలో ప్రభుత్వం అన్ని శాఖలలో పదోన్నతులు ఇవ్వవచ్చు అని గడువును కూడా పెంచుకుంటూ వెళ్తుంది. ఎన్నిసార్లు గడువు పెంచినా విద్యా శాఖలో మాత్రం ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టకపోవడంతో అటు పాఠశాలల పరిపాలన, బోధనా వ్యవస్థకు ఆటంకం కలుగుతున్నది.

కావున తక్షణమే పాఠశాల విద్య అధికారులు స్పందించి ఉపాధ్యాయుల అన్ని క్యాడర్ల ఉపాధ్యాయులకు తక్షణమే పదోన్నతులు చేపట్టాలని ఏపీటీఎఫ్ డిమాండ్ చేసింది.

## పీఆర్సీ కమిషనర్‌ను వెంటనే నియమించాలి: ఏపీ జేఏసీ అమరావతి



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని, తక్షణమే పీఆర్సీ కమిషనర్‌ను నియమించి మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని ఏపీ జేఏసీ అమరావతి డిమాండ్ చేసింది. విజయవాడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బత్తిన రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఉద్యమ అవగాహన సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. అనంతరం ఆర్డీవో వెన్నెల శ్రీనుకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా బత్తిన రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా పీఆర్సీ కమిషనర్‌ను నియమించలేదని, ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మధ్యంతర భృతి, డీఏ బకాయిలు, కొత్త పీఆర్సీ అమలుపై స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు. ఉద్యోగులు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సంయమనంతో వ్యవహరిస్తున్నప్పటికీ ప్రభుత్వం వారి సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. ప్రభుత్వ పరిపాలనలో ఉద్యోగులు కీలక భాగస్వాములని గుర్తించి వారి సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు.

రాష్ట్ర కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను పునరుద్ధరించాలని, ఉద్యోగుల నుంచి ప్రతి నెలా చందాలు వసూలు చేస్తున్నప్పటికీ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ సమర్థంగా పనిచేయడం లేదని అన్నారు. రాష్ట్ర మహిళా చైర్‌పర్సన్ పారే లక్ష్మి కేంద్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగినులతో సమానంగా రాష్ట్ర మహిళా ఉద్యోగినులకు రెండేళ్ల చైల్డ్ కేర్ లీవ్ మంజూరు చేయాలని కోరగా, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు సంపత్ కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయడంతో పాటు వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో వివిధ శాఖల ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గుమ్మడి గోపాలకృష్ణకు సీఎం చంద్రబాబు అభినందన



○ కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డుకు ఎంపికపై ప్రశంస

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఇటీవల కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డుకు ఎంపికైన ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్, ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. సీఎం చంద్రబాబును సచివాలయంలో గోపాలకృష్ణ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా రంగస్థలం నటనకు తొలిసారి కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు రావడం సంతోషకరమన్న సీఎం...గుమ్మడి గోపాలకృష్ణకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. గోపాలకృష్ణ వేసే నాటకాలన్నీ బాగుంటాయని, తన ప్రదర్శనలతో తెలుగు నాటక రంగానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారని ముఖ్యమంత్రి కొనియాడారు.

## ఎల్-నినో ప్రభావంపై అన్ని శాఖలు హై అలర్ట్‌లో ఉండాలి



○ మంత్రి వంగలపూడి అనిత

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఎల్-నినో ప్రభావం నేపథ్యంలో నైరుతి రుతుపవనాల కాలంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు ముందస్తు ప్రణాళికలతో పూర్తి సన్నద్ధతతో పనిచేయాలని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు, జీవనోపాధి పరిరక్షణే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని, వాతావరణ హెచ్చరికల ఆధారంగా ముందస్తు చర్యలు చేపట్టి 'జీరో లాస్' లక్ష్యంతో పనిచేయాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు సన్నద్ధత, ప్రతిస్పందన చర్యలను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని సూచించారు.

రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో 24 గంటలూ కంట్రోల్ రూమ్‌లు పనిచేసేలా చూడాలని, భారత వాతావరణ శాఖ, ఆర్టీజీఎస్, ఏపీఎస్‌డీఎంఏ హెచ్చరికల ఆధారంగా తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఎస్ఈఓసీ ద్వారా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్, సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రజలకు వేగంగా హెచ్చరికలు చేరవేయాలని చెప్పారు. అన్ని శాఖలు ప్రామాణిక కార్యాచరణ విధానాలను కచ్చితంగా అమలు చేసి ప్రతిరోజూ చేపట్టిన చర్యలపై నివేదికలను సమర్పించాలని ఆదేశించారు.

వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ పంటలు, విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య, గ్రామీణ నీటి సరఫరా శాఖలు తమ పరిధిలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని మంత్రి సూచించారు.


అలాగే పంచాయతీరాజ్, మున్సిపల్, జలవనరులు, విద్యుత్, రోడ్లు-భవనాలు, వైద్య ఆరోగ్య శాఖలు మౌలిక వసతులు, తాగునీటి సరఫరా, అత్యవసర వైద్య సేవలు, వరద నియంత్రణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పోలీసు, అగ్నిమాపక, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అత్యవసర స్పందనకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.

సమావేశంలో అధికారులు రాష్ట్రంలో జూన్‌లో 25 శాతం, జూలైలో ఇప్పటివరకు 41 శాతం వర్షపాతం లోటు నమోదైందని వివరించారు. ఈ ఖరీఫ్‌లో 105 మండలాలు తీవ్రంగా, 208 మండలాలు మధ్యస్థ స్థాయిలో కరవు ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి కింద 2026-27 సంవత్సరానికి రూ.479.01 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు.

కమ్యూనిటీ ఆధారిత విపత్తు నిర్వహణలో భాగంగా ఈ ఏడాది 1,214 మంది యువ ఆపదమిత్ర వాలంటీర్లకు శిక్షణ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు.

## అధిక మోతాదులో ఎరువులు వద్దు... సమతుల్యత పాటించండి

○ ఏపీ-ఎయిమ్స్ యాప్ ద్వారా యూరియా, డిఏపి పంపిణీ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** యూరియా, డి.ఏ.పి ఎరువులను అధిక మోతాదులో వినియోగించవద్దని, సమతుల్యత పాటించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ కోరారు. యూరియా, డి.ఏ.పి ఎరువులను ఏపీ-ఎయిమ్స్ యాప్ ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. తుళ్లూరు మండలం పరిమి గ్రామంలో మంగళవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. 2026 - 27 సంవత్సరం నుండి యూరియా, డి ఏ పి ఎరువులను ఏపీ-ఎయిమ్స్ అను యాప్ ద్వారా పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

గత సంవత్సరం అనుభవాల దృష్ట్యా యాప్ ను ప్రవేశ పెట్టడమే కాకుండా జూన్ 8వ తేదీ నుండి ఈ యాప్ ను రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి తీసుకువచ్చిందని చెప్పారు. అపోహలు సరిదిద్దడానికి, పంట వేసే రైతుకు మాత్రమే ఎరువుల అందడానికి, బ్లాక్ మార్కెటింగ్, హోర్డింగ్ డైవర్షన్, అధిక ధరలకు విక్రయించే పాత వ్యవస్థను కట్టడి చేయడం ఈ నూతన వ్యవస్థ ద్వారా వీలుకలుగుతుందన్నారు.

ఈ నూతన విధానంలో యూరియా, డి.ఏ.పి ఎరువులు పంట వేసిన రైతులకు మాత్రమే అందాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. ఇందుకు రైతు సేవా కేంద్రాలను రెవిన్యూ గ్రామంతో అనుసంధానం చేయడం జరిగిందని, రెవిన్యూ గ్రామంలో ఉన్న రైతుల అందరి వివరాలు, 2025 ఖరీఫ్ కాలంలో వారు సాగు చేసిన పంటల వివరాలు, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి సరిపోల్చు నిమిత్తం ఏపీ - ఎయిమ్స్ యాప్ లో అందుబాటులోకి తేవడం జరిగిందని వివరించారు.

ఈ విధానంలో జిల్లాలోని రైతులకు ఇప్పటికీ ఖరీఫ్ పంటకాలానికి సాగు చేసే పంటకు కావలసిన ఎరువులు వారు సాగుచేసిన పంట, విస్తీర్ణాన్ని ఆధారంగా వ్యవసాయ శాస్త్రవేత్తల ఎరువుల సిఫార్సుల అనుగుణంగా కొనుగోలు చేయవచ్చన్నారు. పంట కాలం మొత్తానికి కావలసిన ఎరువులు మూడు దఫాలుగా పంపిణీ జరుగుతుందని స్పష్టం చేశారు.

**వివరాలు సరిచూసుకోండి :** రైతులు ఎరువులు కొనుగోలు నిమిత్తం పంట భూమి వివరాలు, సాగు చేసే పంటల వివరాలు ఆయా రైతు సేవా కేంద్రాలలో సర్వే నెంబరు, ఖాతా నెంబరు, విస్తీర్ణం, పంట సరిగా ఉన్నట్లు రైతు సేవ కేంద్రం సహాయకుల ద్వారా సరిచూసుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రాలలో వివరాలు తప్పుగా ఉంటే మార్పించుకొనుటకు అవకాశం ఉందని చెప్పారు. వివరాలు సరిచేసుకోకుండా యాప్ ద్వారా కొనుగోలు చేసిన తర్వాత వివరాల మార్పు సాధ్యం కాదని స్పష్టం చేశారు. సందేహాలకు, వివరాలకు స్థానిక రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి పూర్తి వివరాలు పొందవచ్చని, స్థానికంగా ఏర్పడే సమస్యలను రాష్ట్ర వ్యవసాయ శాఖ కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నెంబర్ 155251కు గాని లేదా స్థానిక వ్యవసాయ అధికారిని గాని సంప్రదించవచ్చని తెలిపారు.

**అనవసరమైన, అవాస్తవమైన ప్రచారాలు నమ్మవద్దు**

అనవసరమైన, అవాస్తవమైన ప్రచారాలు నమ్మవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. సకాలంలో ఎరువులు సక్రమంగా పంపిణీ చేయడానికి రైతులు జిల్లా యంత్రాంగానికి సహకారం అందించాలని కోరారు. స్థానిక వ్యవసాయ అధికారికి సమాచారం ఇవ్వడం ద్వారా త్వరితగతిన ఎరువులు పొందవచ్చని అన్నారు.

**భూ సేకరణకు సహకరించాలి:** రాజధాని భూముల కొరకు ప్రభుత్వం సేకరణ చేపడుతుందని, అందుకు రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ప్రభుత్వం న్యాయపరమైన నష్టపరిహారాన్ని అందిస్తుందని చెప్పారు.

ఈ సమావేశంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.పద్మావతి, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు,పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ టి. నరసింహా రెడ్డి,ఎ.పి.ఎం.ఐ.పి ఎల్. వజ్రశ్రీ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467